ప్రజలే ప్రభువులు

# జనబలం

ఏప్రిల్ 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## భారత్‌కి 3 అంకెల సవాల్

## థామస్ పికెట్టీ అండ్ కో' ది రెచ్చగొట్టే వాదన


## తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక

## లోక్‌సత్తా అజెండాను చర్చనీయాంశం చేయాలి





# సుప్రీంకోర్టు ఇప్పటికైనా తన తప్పుల్ని సరిదిద్దుకోవాలి



ఢిల్లీ హైకోర్ట్ జడ్జి ఇంట్లో కోట్ల రూపాయల నోట్ల కట్టలు బయటపడటం న్యాయవ్యవస్థకు మాయని మచ్చ. కానీ ఇదేదో అరుదైన కేసు కాదు. సమాజం గురించి ఏమాత్రం అవగాహన ఉన్నవారైనా కోర్టుల్లో అవినీతి గురించి ఇట్టే చెబుతారు. కొందరు నిఖార్సైన న్యాయమూర్తులే ఎల్లవేళలా న్యాయవ్యవస్థను కాపాడలేరు. ఈ పరిస్థితిని గుర్తించే.. ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్ సత్తా కొన్ని ఏళ్లపాటు కృషితో ఉన్నత స్థాయి న్యాయమూర్తుల నిష్పాక్షిక నియామకానికి జాతీయ జ్యుడీషియల్ అపాయింట్మెంట్స్ కమిషన్ (NJAC) చట్టాన్ని అన్ని ప్రధాన పార్టీలనీ ఒప్పించి సాధించింది. సుప్రీంకోర్టు సుప్రసిద్ధ మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్‌లు ఈ చట్టాన్ని లోక్‌సత్తా చొరవతో రూపొందించారు. సుప్రీంకోర్టు సొంతంగా న్యాయమూర్తులను నియమించుకోవటానికి అవకాశమిచ్చిన ప్రస్తుత కొలీజియం తీర్పునిచ్చిన జస్టిస్ వర్మ తన పొరపాటును NJAC ద్వారా సరిదిద్దుకున్నారు. ఉప్పు, నిప్పులా ఉండే కాంగ్రెస్, బీజేపీ కలిసొచ్చి పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించిన NJAC చట్టాన్ని సుప్రీంకోర్టు అన్యాయంగా, అప్రజాస్వామ్యంగా కొట్టివేసింది. ఈవేళ రాజ్యాంగం 75 వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. ఎన్నికైన చట్టసభ కంటే సుప్రీంకోర్టు ఎక్కువ అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చెప్పారా? ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా జడ్జీలను జడ్జీలే నియమించుకునే పద్ధతి ఉందా? రాజ్యాంగ పరిరక్షణ అంటే రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరించటమా? రాజకీయ నాయకుల పట్ల కోపంతో ప్రజల్లో ఎక్కువమంది NJAC పై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకించపోవచ్చు. కానీ ఏదోకరోజు సుప్రీంకోర్టు తన తప్పుని దిద్దుకోవాల్సి ఉంటుందని, NJAC చట్టాన్ని తిరిగి తీసుకురావాల్సి ఉంటుందని ఆనాడే చెప్పాను. ఆ మార్పుకి అవసరమైన పరిస్థితులు ఇంత త్వరగా వస్తాయనుకోలేదు. ఇప్పటికైనా న్యాయవ్యవస్థ స్వతంత్రతను, గౌరవాన్ని, సామర్థ్యాన్ని, విశ్వసనీయతను, రాజ్యాంగబద్ధతను పరిరక్షించేలా NJAC ని, జడ్జీల జవాబు దారీ చట్టాన్ని, నియామకాలకు ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్, ఇతర సంస్కరణల్ని తీసుకురావటం అత్యవసరం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
FDR, లోక్‌సత్తా వ్యవస్థాపకులు




Watch

https://www.youtube.com/@JPLoksatta Official



# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఏప్రిల్ 2025

సంపుటి 26 | సంచిక 04


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**




నా మీదే చెయ్యి వేస్తావా?
ఎమ్మెల్యేనై నీ సంగతి చూస్తా


06 చైనాలా సుస్థిర అధిక వృద్ధిని సాధించగలమా?

08 ‘థామస్ పికెట్టి అండ్ కో’ ది రెచ్చగొట్టే ఎజెండా...

10 నిరాశపరిచిన తెలంగాణ విద్యాకమిషన్ సిఫార్సులు

15 లోక్‌సత్తా మిత్రుల ఆత్మీయ సమ్మేళనం

30 ప్రజాస్వామ్యం పదికాలాలు ఉండాలంటే



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# న్యాయవ్యవస్థపై నీలినీడలు!

సంపాదకీయం

న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. మార్చి 14 వ తేదీ అర్ధరాత్రి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార గృహ ప్రాంగణంలో జరిగిన అగ్నిప్రమాదం అక్కడితో ఆగిపోలేదు. ఆ నిప్పు కాస్తా న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థకి మధ్య చిచ్చు రగిలించింది. దగ్ధమైన గదిలో కాలిన నోట్ల కట్టలు గుట్టలుగా పడివున్న దృశ్యం న్యాయమూర్తుల సమగ్రతను, నిజాయితీని ప్రశ్నార్థకం చేసింది.

ప్రజల నమ్మకానికి, విశ్వాసానికి ఆలంబనగా ఉండాల్సిన ఉన్నత న్యాయస్థానాలు అపోహలకు, అపార్థాలకు తావిచ్చే విధంగా వ్యవహరించడం విచారకరం. 2018 జనవరి 12వ తేదీన సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, మదన్ బి లోకూర్, కురియన్ జోసెఫ్, రంజన్ గోగోయ్ నిర్వహించిన పత్రికా సమావేశం న్యాయవ్యవస్థలో అంతా సవ్యంగా లేదన్న సంగతిని స్పష్టంగా వెల్లడించింది. కీలకమైన, సున్నితమైన కేసుల కేటాయింపు నిష్పాక్షికంగా కనిపించడం లేదని, అప్పటి ప్రధాన న్యాయమూర్తి పాటించిన విధానం సక్రమంగా లేదని నలుగురు న్యాయమూర్తులు తప్పుపట్టారు.

ఆ పత్రికా సమావేశంలో పాల్గొన్న నలుగురు జడ్జీలలో ఒకరైన జస్టిస్ రంజన్ గొగోయ్ , ఆ తర్వాత పదమూడు నెలలపాటు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో అత్యంత కీలకమైన కేసులు విచారణకు వచ్చాయి. ఆయా కేసుల కేటాయింపులో ప్రధాన న్యాయమూర్తిగా ఆయన వ్యవహరించిన తీరు గతంలో మాదిరిగానే తీవ్ర విమర్శల పాలయ్యింది. చివరికి ఒక లైంగిక వేధింపుల కేసులో అభియోగాలను కూడా ఆయన ఎదుర్కున్నారు. కేసు విచారణలో తానే జడ్జిగా కూచుని ఒక కొత్త నమూనాను సృష్టించారు.

2019 నవంబర్లో పదవీ విరమణ చేసిన జస్టిస్ రంజన్ గొగోయ్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాజ్యసభకు నామినేట్ చేశారు. సుప్రీంకోర్టులో పదవీ విరమణ చేసిన కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

2019 జులై ఒకటో తేదీన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగనాథ్ పాండే ఒక కొత్త సంప్రదాయానికి తెర తీస్తూ ప్రధానమంత్రి మోదీకి నేరుగా ఒక లేఖను రాశారు. "న్యాయమూర్తుల ఎంపిక కోసం కొలీజియం వ్యవస్థ రెండు నియమాలు పాటిస్తున్నది, అవి కులతత్వం, బంధుప్రీతి మాత్రమే" అని ఆ లేఖలో పేర్కొన్నారు. న్యాయమూర్తుల ఎంపిక విషయంలో ప్రభుత్వ జోక్యం లేని స్వతంత్ర ప్రక్రియ ఉండాలన్న ఉద్దేశ్యంతో మనదేశంలో కొలీజియం వ్యవస్థను ఏర్పాటు చేసారు. అయితే కొలీజియం వ్యవస్థ పనిపై తొలినుండీ విమర్శలు వెల్లువెత్తుతూనే వచ్చాయి. "కొలీజియం పనిలో పారదర్శకత లేదు" అంటూ జస్టిస్ రంగనాథ్ పాండే తన లేఖలో స్పష్టంగా రాశారు.

న్యాయ వ్యవస్థలో సంస్కరణలు రావాలని, న్యాయమూర్తుల ఎంపిక పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరగాలని, న్యాయమూర్తుల నియామకానికి ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ లోక్‌సత్తా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటు బిల్లు రూపకల్పనలో లోక్‌సత్తా కీలక భూమిక పోషించిన సంగతి కూడా విదితమే.

మార్చి 14వ తేదీ అర్ధరాత్రి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు న్యాయవ్యవస్థలో పారదర్శకత లోపించిందన్న విమర్శకు ఊతం ఇస్తున్నాయి.

అగ్నిప్రమాదం, స్టోర్ రూములో దగ్ధమైన కరెన్సీ నోట్లకట్టలు పలు సందేహాలకు ఆస్కారం కలిగించాయి. అగ్నిప్రమాదం జరిగినప్పుడు అక్కడికి చేరుకున్న పోలీసులు కాలిపోయిన నోట్లకట్టలు గుట్టలుగా పడివున్న దృశ్యాన్ని వీడియో తీశారు. ఆ సొమ్ము పదిహేను కోట్ల నుండి యాభై కోట్ల రూపాయల వరకూ ఉంటుందన్న ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. కానీ వాటిని ఎవరూ అధికారికంగా ఖండించలేదు.

విషయం మార్చ్ 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి వెళ్ళిన తర్వాత జస్టిస్ యశ్వంత్ వర్మను సుప్రీంకోర్టు కొలీజియం అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. బదిలీకి, నోట్లకట్టల ఉదంతానికి సంబంధం లేదని

సుప్రీంకోర్టు ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించింది. అయితే ఆ మాట ఎవరికీ విశ్వాసం కలిగించలేదు. ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆంతరంగిక విచారణకు ఆదేశించారు. ముగ్గురు న్యాయమూర్తుల బృందం విచారణ సాగిస్తున్నది. దానికి కాలపరిమితి ఎంతవరకూ ఉందో తెలియదు.

"తనని ఇరికించడానికి, హాని చేయాలన్న తలంపుతో, వ్యక్తిత్వ హననానికి ఎవరో కావాలని కుట్ర చేశారు" అంటూ జస్టిస్ యశ్వంత్ వర్మ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖలో పేర్కొన్నారు. "మొన్న డిసెంబర్‌లో సామాజిక మాధ్యమాల్లో తనపై లేనిపోని దుష్ప్రచారం జరగడాన్ని బట్టి ఇదో వరుస క్రమంలో జరుగుతున్నట్లు భావిస్తున్నాను" అని కూడా జస్టిస్ యశ్వంత్ వర్మ పేర్కొన్నారు.

తమ కోర్టుకు యశ్వంత్ వర్మ బదిలీని నిరసిస్తూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ నిరవధిక సమ్మెకు దిగింది. తమ కోర్టు "చెత్త బుట్ట" కాదని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ వ్యాఖ్యానించింది. నాలుగురోజుల పాటు విధుల బహిష్కరణ చేసింది. సుప్రీంకోర్టు అంతరంగిక విచారణ పూర్తి అయ్యేంత వరకూ తమ సమ్మెను నిలుపుదల చేస్తున్నట్లు మార్చి 29న అలహాబాద్ బార్ అసోసియేషన్ ప్రకటించి విధులకు హాజరవ్వాలని నిర్ణయించింది. కానీ అప్పటికే జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యక్తిత్వానికి పెద్ద మరక పడింది.

శాసన, కార్యనిర్వాహక విభాగాలకు చెందిన వారి గృహాలలో నోట్లకట్టలు కనిపిస్తే నిమిషాలలోనే పోలీసులు అక్కడికి చేరుకుంటారు. కానీ న్యాయవ్యవస్థకు గల ప్రత్యేక రక్షణ కారణంగా పోలీసు దర్యాప్తునకు అవకాశమే లేదు. దాంతో ఉదంతం చుట్టూ ప్రశ్నలు, అనుమానాలు, కొనసాగుతూనే ఉన్నాయి.
న్యాయమూర్తుల మధ్య సాగిన ఉత్తర, ప్రత్యుత్తరాలు, పోలీసు కమిషనర్ పంపిన ఫోటోలు , వీడియో అధికారికంగా వెల్లడి కావడంతో నోట్ల కట్టలు ఉన్నమాట నిజమేనని వెల్లడైంది.

జస్టిస్ యశ్వంత్ వర్మ అంటున్నట్లు.. ఇది నిజంగా కుట్ర అయితే దాని వెనుక ఎవరున్నారో తేలాలి. నోట్ల కట్టలు కాలిపోయిన దృశ్యాల వీడియో వైరల్ కావడం కూడా విస్మయం కలిగిస్తున్నది. 15వ తేదీన తాము వచ్చి కాలిపోయిన గదిని చూసుకున్నప్పుడు నోట్ల కట్టల గురించి ఎవరూ తనకు చెప్పలేదని, తమ కుటుంబ సభ్యులకు, సిబ్బందికీ దాని గురించి ఏమీ తెలియదని, అక్కడనుండి తొలగించిన బూడిదలో కాలిన నోట్లకట్టలు ఉండి ఉంటే తమ కుటుంబ సభ్యుల సమక్షంలో వాటిని సీజ్ చేయాల్సి ఉందని, అలాంటి ప్రక్రియ జరగలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖలో పేర్కొన్నారు.
దీనిపై సుప్రీంకోర్టు న్యాయవాదులలో భిన్నాభిప్రాయాలు, సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సుప్రీంకోర్టు నియమించిన అంతరంగిక విచారణ నివేదిక వస్తే తప్ప అగ్నిప్రమాదం వల్ల వ్యాపించిన పొగలు, సెగలు సద్దుమణిగేటట్లు కనిపించడం లేదు.

దేశంలో పౌర సమాజం చిరకాలంగా సాగించిన పోరాటంతో న్యాయ సంస్కరణలకు పార్లమెంటు సిద్ధపడింది. 99వ రాజ్యాంగ సవరణ ద్వారా జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటు చేసింది. పార్లమెంటు చేసిన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధం అంటూ సుప్రీంకోర్టు కొట్టి వేసింది. అప్పటి నుంచి దీనిపై పరస్పర విశ్వాసం సన్నగిల్లినట్లు కనిపిస్తున్నది.

న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి అభ్యంతరం చెప్పే వారెవరూ లేరు. జీతాలు ప్రభుత్వం నుండి కాకుండా "సంచిత నిధి" నుండి తీసుకుంటున్నంత మాత్రాన న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారన్న భ్రమలు ఎవరికీ లేవు. నియామకాల్లో ప్రభుత్వ పాత్ర లేకపోయినా న్యాయమూర్తులు ప్రభుత్వం నుండి స్వతంత్రంగా తీర్పులు చెబుతారన్న హామీకూడా ఏమీ లేదు.

పౌరులకు, రాజ్యాంగానికి కట్టుబడి పారదర్శకంగా, జవాబుదారీతనంతో న్యాయ వ్యవస్థ పనిచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. న్యాయవ్యవస్థ రోజు రోజుకూ తన విశ్వసనీయతను కోల్పోవడం చట్టబద్ధ పాలనను ప్రశ్నార్థకం చేస్తుంది. జాప్యం లేకుండా న్యాయ సంస్కరణలపై తక్షణం ముందడుగు వేయాలి. పార్లమెంటు, ఉన్నత న్యాయస్థానం ఈ దిశగా ఒక అంగీకారానికి రావడం అవసరం.

డి. సోమ సుందర్

# 3 అంకెలు - 3% +కి సవాళ్లు :

# చైనాలా సుస్థిర అధిక వృద్ధిని సాధించగలమా?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

కొన్ని ఎన్నికల లెక్కలున్నాగానీ, ఇటీవలి యూనియన్ బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణతో కూడినది, అభివృద్ధిదాయకమైనది అనటంలో సందేహం లేదు. వ్యవసాయ సరఫరా గొలుసుల నుండి సులభతర వ్యాపారం వరకూ వృద్ధికి కావలసిన అన్ని రకాల చర్యలపై దృష్టి సారించి, ఆర్థికమంత్రి కేటాయింపులు చేశారు. కానీ మంత్రిగారు మాంత్రికులేమీ కాదు. తనకున్న పరిమిత వనరుల మధ్యే ఆమె బడ్జెట్‌ను రూపొందించగలరు. ఈ నేపథ్యంలో, యూనియన్ బడ్జెట్ రూపకల్పనలో బాధ్యతాయుత వైఖరిని అభినందిస్తూనే ... ఇప్పుడు ఎదురవుతున్న ఒడిదుడుకుల్ని అధిగమించి, దీర్ఘకాల అధిక అభివృద్ధిని సుస్థిరంగా సాధించటానికి అవసరమైన మిగిలిన అనేక చర్యల మీద మనం దృష్టి సారించటం అవసరం.

మూడు అంకెలు - మన ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న వ్యవస్థాగత సవాళ్లను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

మొదటిది, మనదేశంలో పనిచేసేవారిలో 85-90% మంది ఇప్పటికీ అసంఘటిత రంగంలో ఉన్నారు.



ఏరోజు పని ఉంటుందో, ఏరోజు పస్తులుండాలో తెలియని పరిస్థితి వీరిది. ఎక్కువమంది తక్కువ స్థాయి నైపుణ్యాలు, తక్కువ ఉత్పాదకత, తక్కువ ఆదాయాలు కలిగినవారు.

రెండోది - ఆధునికత, ఆర్థికాభివృద్ధికి పట్టణీకరణ



పర్యాయ పదమైన ప్రస్తుత యుగంలో, మనదేశంలో 65% మంది ప్రజలు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారు. ఉపగ్రహ చిత్రాలపరంగా మనం గణనీయ పట్టణీకరణ సాధించినట్లు కనిపిస్తున్నా, జీ20 దేశాలన్నిటికన్నా మన పట్టణీకరణ స్థాయి అత్యల్పమన్నది నిస్సందేహం.

మూడోది, ఇప్పటికి కూడా మన కార్మికుల్లో 46% మంది తమ జీవనోపాధికి ప్రాథమిక వనరుగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. కొవిడ్ ఉధృతి తదనంతర కాలంలో ఈ సంఖ్య నిజానికి ఇంకా పెరిగింది.

ఈ మూడూ బడ్జెట్ ద్వారా పరిష్కరించలేని భారీసవాళ్లు 2050 నాటికి మనం అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందటానికి అవసరమైన సహేతుకస్థాయి ప్రగతిని సాధించగలగటానికి కూడా మనం 8% లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి రేటుని ఏటా సుస్థిరంగా




సాధించాలి. 6.5% దాకా వృద్ధిరేటుతో కూడా మనం పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో వేగంగా పెరుగుతున్న ఆర్థిక శక్తిగా కొనసాగగలమన్నది వాస్తవమే. ఏదైనా భయంకర ఉత్పాతం సంభవిస్తే తప్ప, మనం కనీసం 5% ప్రగతిని వచ్చే రెండు దశాబ్దాల పాటు నిరాఘాటంగా కొనసాగించగలం. కానీ 5%కి, 8% వృద్ధిరేటుకి ఫలితాల్లో భారీ వ్యత్యాసం ఉంది.

మన ప్రస్తుత స్థూల జాతీయాదాయాన్ని (జీడీపీ) 4 ట్రిలియన్ అమెరికా డాలర్లుగా అంచనా వేస్తే, 8% వృద్ధి రేటుతో తొమ్మిదేళ్లలో 2034 నాటికి మన జీడీపీని రెట్టింపు చేసుకోగలం, 8 ట్రిలియన్ల స్థాయికి చేరుకోగలం. కానీ 5% వృద్ధి రేటుతో, మన జీడీపీ 2034 నాటికి కేవలం 6.2 ట్రిలియన్ డాలర్లకి మాత్రమే పెరుగుతుంది. వార్షిక ఉత్పత్తి నష్టం 1.8 ట్రిలియన్ డాలర్లు, లేదా 150 ట్రిలియన్ రూపాయల దాకా ఉంటుంది. కేవలం 3% తగ్గితే అంత తేడా! తలసరి ఆదాయం పరంగా చూస్తే, ఒక్కొక్కరూ రూ.1,00,000 దాకా నష్టపోవాల్సి ఉంటుంది. పన్ను – జీడీపీ నిష్పత్తి అన్ని స్థాయిల్లో కలిపి 20% అనుకుంటే, జీడీపీలో ఈ నష్టం ఏటా 30 లక్షల కోట్ల రూపాయలుంటుంది. ఆ ఆదాయం గనక అందుబాటులో ఉంటే, ప్రభుత్వాలు సేవల్ని గణనీయంగా మెరుగుపరచగలవు, ఇంకా ఎక్కువ సంక్షేమాన్ని అందించగలవు, మౌలిక వసతుల్లో, అభివృద్ధి ప్రోత్సాహకంలో ఇంకా ఎక్కువ పెట్టుబడులు పెట్టగలవు.

చైనా ఈ 8% వృద్ధిని తదేకంగా మూడు దశాబ్దాల పాటు సాధించింది. ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చేసింది. ప్రపంచ సమీకరణాలకి కొత్త రూపునిచ్చింది.

చైనా నియంతృత్వ దేశం, మనది 'ప్రజాస్వామ్యం' అనే వంకతో మన అసమర్థతని ఇంకా కప్పిపుచ్చుకోలేం.




మనం కలసికట్టుగా పనిచేసినప్పుడల్లా అద్భుత లక్ష్యాల్ని అలవోకగా సాధించి చూపాం. జాతీయ రహదారుల్ని, నౌకాశ్రయాల్ని, విమానాశ్రయాల్ని, రైల్వేల్ని ప్రపంచస్థాయి వేగంతో నిర్మించాం.

చైనా అభివృద్ధి సాధించింది నియంతృత్వం వల్ల కాదు, సరైన విధానం, సమర్థంగా అమలు చేసే వ్యవస్థ వల్ల ఆ దేశం విజయం సాధించింది. వారి రాజకీయ వ్యవస్థ ఉన్నత సామర్థ్యానికి పట్టం గడుతుంది. అర్హత, అనుభవం, హేతుబద్ధ ఆలోచనాశక్తి, ధక్కామొక్కీలు తిని నాయకత్వాన్ని నిరూపించుకున్నవారిని వాళ్లు రాజకీయంగా ఉన్నత పదవుల్లో కూర్చోబెడతారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ మీద వాళ్ల దృష్టి కేంద్రీకరించారు. భూ, కార్మిక మార్కెట్లలో అన్ని అవరోధాలనూ తొలగించారు. వాళ్ల స్థానిక ప్రభుత్వాలు ఎంతో బలమైనవి. దండిగా నిధులు కలిగినవి.

చైనాలో ప్రభుత్వం చేసే వ్యయంలో సగానికి పైగా స్థానిక ప్రభుత్వాల ద్వారానే జరుగుతుంది. వాళ్లు పునాదుల్ని గట్టిగా నిర్మించుకుని, దానిపైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకున్నారు. సైకిళ్లు, చేతి గడియారాలు, దుస్తులు, బొమ్మలు, కుట్టుమిషన్ల నుండి స్మార్ట్ ఫోన్లు, విద్యుత్ వాహనాలు, సౌర ఫలకాలు, బ్యాటరీ స్టోరేజీ, ర్యాపిడ్ రవాణా, ఇప్పుడు ఏ.ఐ వరకు పైకి పెరిగారు. మనం తిరిగి మూలాల్లోకి వెళ్లి చైనాను అనుకరిస్తే అద్భుతాలు సాధించగలం. కోట్లాది ప్రజానీకం అంతర్గత శక్తుల్ని సమాజ అవసరాలు తీర్చే ఉత్పాదకతలుగా మార్చగలం.

## 'థామస్ పికెట్టి అండ్ కో' ది రెచ్చగొట్టే ఎజెండా...

# సరైన పరిష్కారం అందరికీ ఎదిగే సమానావకాశాలు - జేపీ

అసలైన సమస్య... అందరికీ ఎదిగే సమానావకాశాలు తప్ప, ఆర్థిక అసమానతలు కాదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతల వల్ల ప్రపంచం మునిగిపోతోందన్నట్లు థామస్ పికెట్టి వంటి ఆర్థికవేత్తలు, సోషలిస్టులమని చెప్పుకునే రాజకీయ నేతలు చేస్తున్న వాదనలు అర్థరహితమన్నారు. ఎలాన్ మస్కో, మరొకరో బిలియనీర్లు అయినంతమాత్రాన మనకొచ్చే నష్టమేమీ లేదని, వాళ్ళ ద్వారా సమాజానికి సౌకర్యాలు, ఉపాధి లభిస్తున్నంత వరకు కాగితాల మీద ఉండే వారి బిలియన్ల సంపద గురించి మనం ఆందోళన చెందనక్కర్లేదన్నారు. సంపద సృష్టిని, ఉపాధి కల్పనని విస్మరించి, సంపద మీద పన్నులు పెంచి సమాజానికి పంచాలనేది ఏ రకంగానూ అసమానతల్ని తగ్గించదని, కొత్త సమస్యల్ని సృష్టిస్తుందని అన్నారు.

'సమాజంలో ఆర్థిక, ఆదాయ అసమానతలు - అనుసరించాల్సిన వ్యూహాలు' అంశంపై ఎగ్జిబిషన్ సొసైటీ అనుబంధ సంస్థ ఎకనామిక్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి గాంధీ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన సెమినార్‌లో జేపీ అతిథిగా పాల్గొన్నారు.

భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఆర్థిక, సంపద అంతరాలు కాదని ... ఎదిగే అవకాశాలను అందించే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయకపోవటమని జేపీ పేర్కొన్నారు. మార్కెట్ వ్యవస్థలో ఆర్థిక అసమానతలు అనివార్యం. సంపద చేకూరినవారు పన్నులని న్యాయంగా కట్టటం, అందరికీ పుట్టుకతో నిమిత్తం లేకుండా ఎదిగే అవకాశాలనివ్వటం– ఈ రెండూ సంపద సృష్టికి, వ్యక్తికి హుందాతనాన్నిచ్చే సమాజానికి పునాదులు. ప్రతి వ్యక్తికి సంపద సృష్టిలో భాగస్వామ్యం ఉండాలి; ఆదాయం వచ్చే మార్గాలు అందుబాటులో ఉండాలి, అందుకు కావాల్సిన నైపుణ్యం, ఉత్పాదకత పెంచాలి. తాత్కాలిక సంక్షేమ పథకాలను వీటికి ప్రత్యామ్నాయంగా అందించి ఎన్నికల్లో



గెలిచే రాజకీయాన్ని అన్ని ప్రధాన పార్టీలు పోటాపోటీగా అమలు చేస్తుండటం వల్ల ... సంపద సృష్టిని పాపంగా భావించే ధోరణిని మానవ సమాజ అసూయ ద్వారా రెచ్చగొట్టే, ప్రమాదకర బాధ్యతారహిత ధోరణులకు మన దేశంలో ఆదరణ లభిస్తోందన్నారు. అభివృద్ధి ఎంతోకొంత కనిపిస్తూ, అందులో తమకు భాగస్వామ్యం లభిస్తోందన్న నమ్మకం ఉన్నచోట ప్రజలు ప్రభుత్వాల్ని గెలిపిస్తున్నారని, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ఈ సంకేతం స్పష్టంగా కనిపించిందన్నారు. కొంత దుబారా చేసినా, అభివృద్ధిని అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు ఆదరించారని, ఇక్కడ 24

స్థానాల్లో ఒక్కటి కూడా కాంగ్రెస్‌కు రాలేదన్నారు. అభివృద్ధి అంతగా అందుబాటులోకి రాకపోవటం వల్ల, అభివృద్ధి గ్రామాలలో అత్యధికుల జీవితాలను స్పృశించక పోవటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వివిధ గారంటీల రూపంలో పలు సంక్షేమ పథకాల అమలు హామీలిచ్చిన కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు లభించి అధికారంలోకి రాగలిగిందన్నారు. అభివృద్ధిని సమ్మిళితం చేసి, అందరికీ అందించేందుకు, అందరికీ ఎదిగే సమాన అవకాశాలను అందించేందుకు చర్యలు తీసుకోకుంటే దేశం ఆర్థికంగా అవకాశాల్ని కోల్పోవటంతో పాటు రాజకీయ పార్టీలు కూడా ప్రజాదరణ కోల్పోతా యన్నారు. తాత్కాలిక తాయిలాలు ఎల్లకాలం గెలిపించ వన్నారు. సంక్షేమం అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధి కావాలన్నారు. కాబట్టి సంపద సృష్టించే వారిపై ప్రతికూల ఆలోచనలకు బదులు ... సమ్మిళిత అభివృద్ధి, అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఎక్కడికక్కడ ఉపాధి అవకాశాలకు జవాబుదారీతనంతో సాధికారత, చిన్న పట్టణాలను గ్రామాల మధ్య ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటానికి చర్యలు వంటివి అమలు చేయాలన్నారు. అభివృద్ధికి దోహదం చేసేరీతిలో, సమతూకంగా సంక్షేమం ఉండాలన్నారు.

**6% నిధులు శుష్క నినాదం**

జననాల రేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఉన్నకొద్దీ తగ్గుతున్నప్పుడు ఇప్పుడు చేస్తున్న సర్కారీ వ్యయమే ఆ రంగంలో సరిపోతుందని, విద్యకు 6% ఖర్చు పెట్టాలనేది పసలేని నినాదమన్నారు. గౌరవనీయులు, సదుద్దేశంగలవారు అలాంటి వాదన చేయటం దురదృష్ట కరమన్నారు. పాఠశాల విద్యలో మనకంటే తక్కువ వ్యయం చేస్తున్న దేశాల్లో అత్యధిక శాతం పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ నాణ్యమైన విద్యను పొందుతుంటే, మనవద్ద ఒక్కో విద్యార్థి పైన రూ.1 లక్షకు పైగా ఏటా ఖర్చవుతున్నా చదువులు అధ్వాన్నంగా ఉంటున్నాయన్నారు. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయికి ప్రజలు ప్రతిఫలాన్ని పొందాలి; అంతేగాని ఖర్చు ఎక్కువ, ఫలితం తక్కువ అయితే బీదరికమే మిగులుతుంది.

ఉన్నకొద్దీ ప్రభుత్వ స్కూళ్లు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతూ ప్రయివేటు బడులలో చేరేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. అదేవిధంగా, ఆరోగ్యంలో ప్రపంచంలోనే పెద్ద, గణనీయ దేశాలన్నిటిలో కెల్లా ఆ రంగానికి అతి తక్కువ కేటాయింపులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వైద్య, ఆరోగ్య రంగానికి వెచ్చించే నిధులు మాత్రం 1.3 శాతం దాటలేదని, కొవిడ్ లాంటి ఉత్పాతాల నుంచి కూడా మనం సరైన పాఠాలు నేర్చుకోకుండా భ్రమల్లోనే బతుకుతున్నామన్నారు. సరైన పాఠశాల విద్య, ప్రాథమిక ఆరోగ్యం లేకుంటే, అణగారిన, పేద వర్గాలే ఎక్కువ మూల్యం చెల్లిస్తాయని, రిజర్వేషన్లున్నా పెద్ద ఉపయోగం ఉండదని, ఉత్పాదకత పెరగాలని హెచ్చరించారు.

అనంతరం సభికులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబిచ్చారు. వృద్ధిరేటు 8 శాతం కోసం ప్రయత్నించకుండా, 5%కి పరిమితమైతే ఎన్ని లక్షల కోట్లు నష్టపోతామో తెలియజేశారు. కేవలం 9 సంవత్సరాల కాలంలో ఈ రెంటికీ తేడా ఏటా 1.8 ట్రిలియన్ డాలర్లు;అంటే తలసరి ఆదాయం లక్ష రూపాయలు తేడా! ఇలా జాతీయాదాయం తగ్గటం వల్ల దాదాపు రూ.20 లక్షల కోట్ల పన్నుల ఆదాయం తగ్గుతుంది.అభివృద్ధి, సంక్షేమం- రెండూ కుంటుపడతాయి, అని వివరించారు. అందుకే అత్యధిక శాతం అభివృద్ధిని సాధించటం, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించటం మన ముందున్న కర్తవ్యాలని జేపీ వివరించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎకనామిక్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ గంగాధరరావు మాట్లాడుతూ, చాలా లోతైన అధ్యయనం, పరిశోధనతో జేపీ నేతృత్వంలోని ఎఫ్‌డీఆర్ యువ బృందం విలువైన సమాచారాన్ని అందిస్తోందన్నారు. వృద్ధిరేటు 1% తేడా వస్తే ఆర్థికంగా, ఉపాధి అవకాశాల పరంగా ఎంత నష్టపోతామో జేపీ చెప్పిన గణాంకాలు విలువైనవని, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కోసం మనందరం మేలుకోవాలన్నారు.

జేపీలాంటి వారి ప్రసంగాలను వినటం, సోషల్ మీడియా ఖాతాలను అనుసరించటం ద్వారా యువత విలువైన, విశ్వసనీయ సమాచారాన్ని పొందగలుగుతారన్నారు. రాబోయే కాలంలో ఎక్కువ భాగం యువతదేనని, అందువల్ల వాళ్లు వాస్తవిక అవగాహనని, పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా కృషికి ఎగ్జిబిషన్ కమిటీ తరపున అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని, ముఖ్యంగా పాఠశాల విద్యలో ప్రమాణాలు పెంచటానికి, పిల్లలు శాస్త్రీయ ఆలోచనా తీరు అభివృద్ధికి జిల్లాకో సైన్స్ ల్యాబొరేటరీ స్థాపించాలనే జేపీ బృందం ప్రయత్నంలో భాగస్వాములు కావటానికి సిద్ధమని తెలిపారు.

ఎకనామిక్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆదిత్య మార్గం, కార్యదర్శి రంగారెడ్డి, కోశాధికారి డాక్టర్ వంశీ తిలక్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, సభ్యులు, కస్తూరిబా గాంధీ, సర్దార్ పటేల్ కళాశాల విద్యార్థులు సెమినార్‌లో పాల్గొన్నారు.

✶

# నిరాశపరిచిన తెలంగాణ విద్యాకమిషన్ సిఫార్సులు

మనదేశంలో రాజకీయాల పట్ల చులకన భావం ఉందిగానీ, పదవుల పట్ల మాత్రం చాలా ఆకర్షణ ఉంది. దర్పాన్ని ప్రదర్శించగలిగే, అధికారాన్ని చెలాయించగలిగే పదవి అయితే దేవుడితో సమానంగా పూజిస్తారు. ప్రధాన రాజకీయ పార్టీలో అయితే, పార్టీ పదవికి కూడా విపరీతంగా పోటీపడే సమాజం మనది.

ఈ సామాజిక, సాంస్కృతిక ధోరణులతో పాటు, ఒక స్థాయి వచ్చాక డబ్బు కంటే పేరు ప్రతిష్ఠల్ని ఎక్కువగా కోరుకునే మానవనైజం; మన పెత్తందారీ, కేంద్రీకృత పాలనా వ్యవస్థలో స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి, చిత్తశుద్ధితో పనిచేసేవారికైతే సమాజం మొత్తానికి రాజకీయాధికారం ప్రధాన మార్గం కావటంతో ఇప్పటికీ రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నవారి సంఖ్య తక్కువేమీ కాదు. ఎన్నికల్లో అంతంత అక్రమ డబ్బు ఖర్చు లేకుంటే, ఈ సంఖ్య అనేకరెట్లు ఎక్కువగా ఉండేదేమో! రాజకీయం ద్వారా ఏదైనా సాధించుకోవాలనుకునేవారిలో నేరచరితులు, ఉద్యోగంలో ఉండగా పాలకులకు దాసోహం అన్న సివిల్ సర్వెంట్లు వంటివారు స్వార్థపూరిత కేటగిరీకాగా, మిగిలినవారు సమాజహితం విభాగంలోకి వస్తారు. అలా ఇటీవలికాలంలో జనహితం కోసం రాజకీయ కృషిలోకి వచ్చిన గుర్తింపు పొందిన వారిలో ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఒకరు.

తెలంగాణ జయశంకర్ భూపాల్‌పల్లి కలెక్టర్‌గా ఆయన చేసిన కొన్ని విమర్శలు అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించటంతో ఏ పదవీ ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు. కొంతకాలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారుగా కూడా పనిచేశాక, చివరికి మురళి ఐఏఎస్‌కి రాజీనామా చేసి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకున్నా ... ప్రజా సంఘాలతో కలిసి, పౌరుని హోదాలోనూ రాజకీయ కృషి చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి, వ్యాపారంలో రాజకీయ ఆశ్రిత పక్షపాతం అప్రజాస్వామిక ధోరణులు, మతతత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఓటు విలువపై ప్రజల్లో



అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పౌర సమాజాన్ని సమీకరించటంలో కీలకంగా వ్యవహరించారు. కాంగ్రెస్‌లోని కొందరు ఉన్నతస్థాయి వ్యక్తులతో ఆయనకున్న సంబంధాలు మొదలైన కారణాల వల్ల రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక కొంతకాలానికి మురళి ఛైర్మన్‌గా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచటం, ఆ రంగంలోని లోపాల్ని సరిచేయటానికి క్షుణ్ణంగా అధ్యయనం కమిషన్‌కు అన్ని రకాల సహాయ సహకారాల్ని అందించాలని ప్రతిజిల్లా యంత్రాంగానికీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కమిషన్‌లో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, సీహెచ్ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి సభ్యులుగా ఉన్నారు.

విద్యారంగంలో తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధుల్ని రాష్ట్రం ఏర్పడిన నాటినుంచీ ఖర్చు చేస్తోంది. చిత్తశుద్ధి గల అధికారులు, సమ్మిళిత అభివృద్ధిలో విద్య ప్రాధాన్యం తెలిసిన యంత్రాంగం ఉన్న చోటల్లా నిధులు సద్వినియోగమై మంచి ఫలితాలు వచ్చాయి. కానీ మొత్తంగా చూస్తే కొన్ని గురుకులాలు మినహాయించి తెలంగాణలో ప్రభుత్వ విద్య పాఠశాల స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు ప్రమాణాల్లో దిగజారింది. పాఠశాల విద్య అధ్వాన్నమవటంతో పునాదులు బలహీనపడ్డాయి. ప్రయివేటు రంగం కాస్త మెరుగ్గా ఉండటంతో క్రమంగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లకు మళ్లే పిల్లల సంఖ్య పెరిగింది. ఉచితమైనా, భవనాలున్నా ప్రభుత్వ స్కూళ్లకు పిల్లల్ని పంపటానికి పేద,

దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులు కూడా ఆసక్తి కనబరచటం లేదు. దీంతో విద్యా రంగానికి నిధులు పెరగకపోయినా, ప్రభుత్వ పాఠశాలలో ఒక్కో విద్యార్థిమీదా సర్కారీ వ్యయం ఏడాదికి రూ. 1,10,000 దాకా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యను ఎలాగైనా బాగు చేయాలనుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ శాఖను తన పరిధిలోనే అట్టిపెట్టుకుని పర్యవేక్షిస్తున్నారు. ఐఏఎస్ అధికారిగా, నిజాయితీగా, నిక్కచ్చిగా పనిచేసిన విద్యారంగంలో అనుభవమున్న ఆకునూరి మురళి ఆధ్వర్యంలో విద్యా కమిషన్ ఏర్పాటు చేశారు.

ప్రజలు, ముఖ్యంగా ఆలోచనాపరులు కూడా మురళి నేతృత్వంలోని కమిషన్ నుంచి ఎంతో ఆశించారు. ఎందుకంటే, మురళి అనుభవజ్ఞుడు మాత్రమే కాదు, విద్యపట్ల, ఎంతో మమకారం కలిగినవారు. అదేవిధంగా ప్రజాధనం సద్వినియోగం పట్ల చాలా శ్రద్ధ వహించేవారు. ఉదాహరణకు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో, ఇక్కడి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మాట్లాడటమంటే రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా మాట్లాడటమేనన్న అభిప్రాయం ప్రబలంగా ఉన్న రోజుల్లో, ప్రాణహిత – చేవెళ్ల సాగునీటి ప్రాజెక్ట్ వల్ల వ్యయం ఎక్కువ, ఫలితం తక్కువతో తెలంగాణాకు ఎలా నష్టం జరుగుతుందో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో, బయట బలంగా వివరించారు. ఆరోజున జేపీ వాదనను సమర్థించిన కేసీఆర్, ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడి ముఖ్యమంత్రి అయ్యాక మాటమార్చి, ప్రాణహిత – చేవెళ్లనే రీడిజైన్ చేసి బడ్జెట్‌ను ఇంకా భారీగా పెంచి, కాళేశ్వరం ప్రాజెక్ట్‌గా చేపట్టినప్పుడు కూడా జేపీ తీవ్రంగా తప్పుపట్టారు. మాట మార్చిన కేసీఆర్ పార్లమెంటరీ సంప్రదాయానికి విరుద్ధంగా అసెంబ్లీలో జేపీపై తీవ్ర విమర్శలు గుప్పించినప్పుడు లోక్‌సత్తా నేతలు సహా తెలంగాణ సమాజంలో ఎవరూ ఖండించలేదు. చివరికి అమెరికా పర్యటనలో ఉన్న జేపీయే తెలంగాణ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఆ ప్రాజెక్ట్ ఎందుకు నష్టదాయకమో వివరిస్తూ, అక్కడినుంచే ప్రకటన జారీ చేశారు. అలా జేపీ మినహా దాదాపు మిగతా తెలంగాణ సమాజమంతా కాళేశ్వరంపై మౌనం వహించినప్పుడు, సంబంధింత ఇంజనీర్లు, ఐఏఎస్‌లు రాజకీయ దోపిడీలో భాగమై తమ స్వార్థం చూసుకుంటున్నప్పుడు ... రాజకీయానంతరం ఆకునూరి మురళి కాళేశ్వరానికి వ్యతిరేకంగా చాలా బలంగా గొంతు వినిపించటం ప్రారంభించారు. అదేవిధంగా లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ ఎజెండా అయిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, మహిళల సాధికారత గురించి

> **స్కూలు విద్యను బాగుచేయటానికి కొత్తగా వేలమంది టీచర్లను నియమించటం, విద్యార్థులు లేక మూసివేసిన పాఠశాలలను తిరిగి తెరవటం, ఏసీ గదులతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేయటం మార్గాలనుకుంటున్న ముఖ్యమంత్రికి, అవన్నీ భ్రమలని కమిషన్ స్పష్టంగా చెప్పలేకపోయింది. అలా చెప్పకపోగా, ప్రభుత్వ పాత్ర ప్రత్యక్షంగా ఏమాత్రం అవసరం లేని అంశాలను ఎక్కువగా ప్రస్తావించింది.**

కూడా చాలా స్పష్టంగా వాదనలు వినిపిస్తూ బలపరిచారు. తన సామాజిక ఖాతాల్లో, ప్రసంగాల్లో, పర్యటనల్లో ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమైన ఈ ఎజెండా కోసం మురళి గొంతు వినిపించారు. కేసీఆర్ పట్ల వ్యతిరేకత పెరిగి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల నష్టం స్పష్టంగా కనిపించాక, అందరూ విమర్శించటం మొదలుపెట్టారు. కానీ అంతకుముందునుంచే జేపీ వాదనను బలపరిచి, తక్కువ ఖర్చుతో తెలంగాణాకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా సాగునీటి ప్రాజెక్టలను చేపట్టి ప్రజాధనాన్ని సద్వినియోగం కోసం ప్రతిపాదించటం, అణగారిన, పేదవర్గాల అభివృద్ధికి నాణ్యమైన విద్య కోసం కృషి చేయటం మొదలైన కారణాల వల్ల మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్‌పై ఆశలు పెరిగాయి. కానీ కమిషన్ సిఫార్సులు నిరాశపరిచాయి.

విద్యా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, చర్చించిన సందర్భంగా బహిరంగపరచిన సిఫార్సులు పేలవంగా ఉన్నాయి.

మురళి నేతృత్వంలోని కమిషన్ 33 జిల్లాల్లో విస్తృతంగా పర్యటించింది. ప్రీస్కూల్ నుంచి యూనివర్సిటీ స్థాయివరకూ విద్యా సంస్థల్ని సందర్శించింది. వీటిలో కేజీబీవీలు, మోడ్రన్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. హాస్టళ్లనూ సందర్శించింది. అంగన్వాడీల్లో సమస్యలు విన్నది. స్వచ్ఛంద, పౌరసమాజ సంస్థలతో సమావేశమైంది. జిల్లా స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర భాగస్వాములతో మాట్లాడింది. రాష్ట్రం బయట కూడా పర్యటించటంతోపాటు, ఎంపిక చేసిన జిల్లాల్లో వర్క్‌షాప్‌లు, మేధోమథన సదస్సులు

నిర్వహించింది. ఇంత డేటాను, ఇన్ని అభిప్రాయాలను, క్షేత్రస్థాయి అవరోధాలను పరిశీలించికూడా విద్యా ప్రమాణాల గురించి, తల్లిదండ్రుల్లో, టీచర్లలో, ప్రయివేటు యాజమాన్యాలలో విద్యలో విజయం పట్ల ఉన్న ఆసక్తిని ఆ ప్రమాణాల పెంపు దిశగా మలిచే నిర్దిష్ట చర్యలను సిఫార్సు చేయలేదు.

మొత్తం చదువుకి, పరిశోధనలకి పునాది అయిన పాఠశాల విద్యకు సంబంధించి కమిషన్ సిఫార్సులకే ప్రస్తుతానికి పరిమితమవుదాం.

స్కూలు విద్యను బాగుచేయటానికి కొత్తగా వేలమంది టీచర్లను నియమించటం, విద్యార్థులు లేక మూసివేసిన పాఠశాలలను తిరిగి తెరవటం, ఏసీ గదులతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేయటం మార్గాలనుకుంటున్న ముఖ్యమంత్రికి, అవన్నీ భ్రమలని కమిషన్ స్పష్టంగా చెప్పలేకపోయింది. అలా చెప్పకపోగా, ప్రభుత్వ పాత్ర ప్రత్యక్షంగా ఏమాత్రం అవసరం లేని అంశాలను ఎక్కువగా ప్రస్తావించింది.

మీడియాలో వచ్చిన వార్తలను బట్టి తెలంగాణ విద్యాకమిషన్ తన నివేదికను మొదట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించింది. "రాష్ట్రంలో 12,100 ప్రయివేటు పాఠశాలలు ఉండగా, మొత్తం విద్యార్థుల్లో 60 శాతం వీటిలోనే చదువుతున్నారు. కొన్ని స్కూళ్లు విద్యార్థుల నుంచి ఏడాదికి రూ. లక్షన్నరకు పైగా ఫీజులు తీసుకుంటున్నాయి. హైదరాబాద్‌లోని ఓ పాఠశాల అత్యధికంగా ఏడాదికి రూ. 22 లక్షలు వసూలు చేస్తోంది. 120 స్కూళ్లు అత్యధికంగా ఫీజులు తీసుకుంటున్నాయి" అని విద్యా కమిషన్ ఈ సందర్భంగా తెలిపింది.

ఆ తర్వాత కమిటీ ముఖ్యమంత్రితో సమావేశమైంది. మల్టీగ్రేడ్ టీచింగ్, అంటే, ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకూ పాఠాలు చెప్పడం, మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండటం, భోజనం ఖర్చుల్ని 50 శాతం మేర పెంచటం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసి, ఎక్కువ సదుపాయాలు, ఎక్కువమంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేవిధంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను 1800-2000 మంది విద్యార్థులుండేలా నిర్మించటం, ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల్ని నియంత్రించటం మొదలైన అంశాలపై సిఫార్సుల్ని చర్చించింది. అదేవిధంగా 99% మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవాలని కోరుకుంటున్నారని, ఆంగ్ల బోధనలో ప్రమాణాల్ని పెంచాలని, విద్యా ప్రమాణాల పర్యవేక్షణకి ఒక రెగ్యులేటరీ కమిషన్‌ని ఏర్పాటు చేయాలని సూచించింది. సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల్ని మెరుగుపరచాలని, మధ్యాహ్న భోజన పద్ధతుల్ని ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా విస్తరించాలని సిఫార్సు చేసింది. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు నియోజకవర్గాల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర విధానాలు రూపొందించాలని కోరారు.

విద్యా కమిషన్ నివేదిక నేపథ్యంలో, విద్యా సంస్కరణలపై అంతకుముందు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, రాష్ట్ర ఐ.టి మంత్రి శ్రీధర్‌బాబు అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రయివేటు పాఠశాలలను కేటగిరీలుగా విభజించటం, గరిష్ఠం, కనిష్ఠం అని, ఫీజుల్ని నిర్ణయించటం పట్ల సమావేశంలో విముఖత వ్యక్తమైంది. ఆ స్కూళ్ల ఫీజులను ప్రభుత్వం నిర్ణయిస్తే, న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రయివేటు విద్యాసంస్థలు 10% శాతం వరకు ఫీజులు ఏటా పెంచుకోవచ్చని 2017లో ఆచార్య తిరుపతిరావు కమిటీ చేసిన సిఫార్సు సబబేనని మంత్రి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఉపసంఘంలోని మిగిలిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో చర్చించి తుదినిర్ణయం తీసుకుందామని వాయిదా వేశారు.


**మధ్యాహ్న భోజన పథకంపైనా మొక్కుబడి సిఫార్సు**



తెలంగాణలో ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం వల్ల వారం వ్యవధిలో ఆస్పత్రి పాలవటం, తరచూ స్కూళ్ల భోజనంపై ఫిర్యాదులు రావటం వల్లనేమో విద్యా కమిషన్ ఆ అంశాన్ని ప్రత్యేకించి ప్రస్తావించి చర్యలకు సిఫార్సు చేసి ఉండవచ్చు. అక్కడ సమస్య ఉన్నమాట వాస్తవం. అందువల్లే మొత్తం తెలంగాణలో సగటున 30.89 శాతం మంది పిల్లలు స్కూళ్లలో మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉండి, ఇంటి

నుంచి తెచ్చుకున్న ఆహారం తింటుండగా, హైదరాబాద్‌లో ఆ సంఖ్య 50 శాతం దాకా ఉంది. అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఆ బాధ్యత అప్పజెపితే ఎటువంటి ఫిర్యాదులకూ ఆస్కారం లేకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని రుచికరంగా పిల్లలకు మధ్యాహ్న భోజనంగా అందించగలుగుతారు. ప్రభుత్వానికి నిర్వహణ వ్యయం కూడా తగ్గి, తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు వస్తాయి. అదేవిధంగా, చాలామంది తల్లిదండ్రులూ... పిల్లలకు పోషకాహారం పెట్టే స్తోమత తమకుందని, ఇంటి భోజనం తినే అవకాశం ఉండగా బయటి ఆహారం ఎందుకు అని ప్రశ్నిస్తున్నట్లు కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకుని కమిషన్ సిఫార్సులు చేయకుండా ఇంకా బడ్జెట్ 50 శాతం పెంచాలని మొక్కుబడి పరిష్కారాన్ని సూచించింది. ఈ విషయంలో కమిషన్ సమగ్రంగా, సృజనాత్మకంగా, ఆచరణసాధ్యంగా ఆలోచించి పరిష్కారం చూపి ఉంటే, ఆంధ్రప్రదేశ్‌కి కూడా మార్గదర్శకమయ్యేది. ఎందుకంటే, బడుల్లో మధ్యాహ్న భోజనం ఎక్కువగా వికటిస్తున్న తొలి అయిదు రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణ ఉండటంతోపాటు, దొంగ లెక్కలతో బడ్జెట్ పెరగటమే తప్ప ఫలితాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి.

**ఇంటి భాష, ఇంగ్లీష్ మీడియంపై ...**




మరోవంక, తల్లిదండ్రులు కోరుతున్నారు కాబట్టి, ఇంగ్లీష్ మాధ్యమంలో బోధనకు సిఫార్సు కూడా లోతైన ఆలోచన లేకుండా చేసినట్లు కనిపిస్తుంది. పాఠాలు వినే పిల్లలకే కాదు, చెప్పే టీచర్లకు కూడా ఆంగ్ల భాషా ప్రావీణ్యం లేదని కమిషన్ సరిగానే గుర్తించింది. దానికి ఆచరణాత్మక పరిష్కారం – ఇంగ్లీష్ బోధనా ప్రమాణాల్ని పెంచటం మాత్రమే కాదు, అంతకంటే ముందు, పిల్లలకు అర్థమయ్యే, పిల్లలు ఇంట్లో మాట్లాడుకునే భాషలో విద్యాబోధన ప్రారంభించటం, క్రమంగా ఇంగ్లీష్ వైపు మళ్లించటం. బోధనలో పిల్లలకు అర్థమయ్యే భాష, అది మాతృభాషో, మరోభాషో, అందులో బోధించటంతో చదువు

**ప్రజలూ అభిప్రాయాలు పంపొచ్చు**

**పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ, మధ్యాహ్న భోజన పథకం పటిష్ట అమలు, స్కూలు విద్యలో తీసుకురావాల్సిన మార్పులపై ప్రభుత్వానికి తెలంగాణ విద్యా కమిషన్ వేర్వేరుగా నివేదికలు అందచేసింది. ఆ సిఫార్సులపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం. నివేదికను కమిషన్ తాజాగా తన వెబ్ సైట్ లో ఉంచింది. ప్రజలూ తమ అభిప్రాయాలను పంపొచ్చు.**

మొదలవ్వాలనే మౌలిక సూత్రాన్ని కమిషన్ విస్మరించినట్లు కనిపిస్తుంది.

విద్యా ప్రమాణాలను పర్యవేక్షించటానికి ఒక రెగ్యులేటరీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న కమిషన్ సూచన స్వాగతించదగ్గది. కానీ అందుకు అవసరమైన పరీక్షల విధానంలో మార్పు గురించిన ప్రస్తావన కొరవడింది.

మొత్తంగా బేరీజు వేసి చూస్తే, తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక చాలామేర నిరాశ పరుస్తుంది.

**ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాలి ...**

విద్యా కమిషన్ ఏర్పాటైన సుమారు రెండు నెలలకి ఈ నివేదికను ఇచ్చింది. కమిషన్‌కు ఇంకా 22 నెలల వ్యవధి ఉంది. ఆకునూరి మురళికి పరిపాలనలో అనుభవం, విద్యారంగంలో ఆసక్తి, పేద, అణగారిన వర్గాల విముక్తికి, అందరికీ ఎదిగే అవకాశాలకు నాణ్యమైన విద్యే మార్గమన్న స్పష్టత, అందుకోసం తపన ఉన్నాయి. పాఠశాల, విద్యారంగంలోని సమస్యల్ని మరింత క్షుణ్ణంగా పరిశీలించాలి.

☞ తెలంగాణలో జనాభా రేటు తగ్గుతూ, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నప్పుడు అదనంగా టీచర్ల రిక్రూట్‌మెంట్ ఎందుకు?

☞ విద్యార్థులు లేని స్కూళ్లను మూసివేసి, హేతుబద్ధీకరిస్తే ప్రతి 18 మంది పిల్లలకూ ఒక టీచర్ ఉంటారు. అలాంటప్పుడు మళ్లీ కొత్తగా ఉపాధ్యాయుల నియామకం అవసరమేమిటి?

☞ 8వ తరగతి విద్యార్థుల్లో పలువురు 2వ తరగతి పాఠం చదవలేనప్పుడు, రెండంకెల భాగహారం చేయలేనప్పుడు అందర్నీ అన్ని తరగతుల్లో పదవ తరగతి వరకూ ప్రమోట్ చేయడంలో అర్థముందా?

☞ తరగతి స్థాయి సామర్థ్యం లేని వారిలో అనేకమందికి పరీక్షల్లో 90 శాతానికి పైగా మార్కులు ఎలా వస్తున్నాయి?

☞ విద్యార్థులు విషయాల్ని స్పష్టంగా అర్థం చేసుకోవటానికి, తెలియజేయటానికి, పాఠ్యపుస్తకంలోని గణిత సమస్యల్ని పరిష్కరించగలగటమే కాకుండా వాటిని నిత్య

జీవితావసరాలకు అన్వయించటం, సంక్లిష్ట సమస్యల్ని పరిష్కరించే సృజనాత్మకత మొదలైన నైపుణ్యాన్ని ఎలా పరీక్షిస్తారు?

☞ మాస్ కాపీయింగ్, బట్టీ పట్టటం వల్ల ప్రయోజనం లేని రీతిలో పైన పేర్కొన్న నైపుణ్యాల్ని పరీక్షించేలా అంతర్జాతీయంగా అనేక దేశాల్లో అమలవుతున్న పరీక్షా పద్ధతుల్ని ఎందుకు స్వీకరించటం లేదు?

☞ పిల్లలపై ఒత్తిడి లేకుండా తమకంటూ ప్రత్యేకమైన శక్తిసామర్థ్యాలను వారు ఏ మేరకు పెంపొందించుకున్నారు, అభ్యసన సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయి పరీక్షించేందుకు జాతీయ విద్యా విధానంలో పేర్కొన్న అంశాలను వేగంగా ఎలా అమలు చేయవచ్చు?

☞ విద్యలో ఖర్చుపెట్టే ప్రతి రూపాయి విద్యార్థి చుట్టూ, అంటే విద్యా ప్రమాణాల చుట్టూ మాత్రమే తిరగాలి. ఉపాధ్యాయులకి జీతభత్యాలు, ప్రోత్సాహకాలు, ఇతరత్రా అంశాలన్నీ విద్యా ప్రమాణాలకు అనుగుణంగానే ఉండాలి అన్న సంకేతం ప్రభుత్వం నుంచి ప్రతిరోజూ స్పష్టంగా వినిపించేలా, విద్యలో సక్సెస్‌కి నిర్వచనాన్ని మార్చి, వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించేలా ఇప్పుడున్న బడ్జెట్‌లోనే ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

☞ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హైబ్రీడ్ విద్యావిధానాన్ని ఎలా ఎలా పటిష్టం చేయాలి?

... మొదలైన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలతో స్థానిక ప్రభుత్వాలకు పాత్ర కల్పిస్తూ సమగ్ర రీతిలో సిఫార్సుల్ని తెలంగాణ విద్యాకమిషన్ రూపొందిస్తుందని, బలమైన పాఠశాల విద్య పునాదిగా రాష్ట్ర విద్యా వ్యవస్థను పటిష్ఠం చేస్తుందని ఆశిద్దాం.

**ముఖ్య సిఫార్సులు:**

☞ ప్రైవేటు పాఠశాల లేదా జూనియర్ కళాశాలలో విద్యార్థి చదువుతున్న సమయంలో తండ్రి లేదా సంపాదించే కుటుంబ సభ్యుడు చనిపోతే, ఫీజు చెల్లించలేదన్న కారణంతో ఆ విద్యార్థిని మధ్యలో వెళ్లిపోవాలని బలవంతం చేయటానికి వీల్లేదు. ఆ విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు అలాంటి విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయకూడదు.

☞ ప్రైవేటు స్కూళ్లు, జూనియర్ కాలేజీలు రెండేళ్లకోసారి ఫీజులను సవరించుకోవచ్చు. వినియోగదారుల ధరల సూచిక (సీపీఐ) ఆధారంగా ఆ పెంపు ఉండాలి. హైకోర్టు విశ్రాంత జడ్జీ చైర్మన్ గా రాష్ట్ర స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేయాలి. కమిషన్ నిర్ణయించే రుసుములు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు పాటించాలి.

☞ తరగతులవారీగా ఫీజు నిర్ణయించాలి. అందుకు ప్రధానంగా 15 రకాల కొలమానాలను పరిగణలోకి తీసుకోవాలి.

☞ నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యాసంస్థల అనుమతులను కూడా రద్దు చేయాలని సంబంధిత అధికారులను కమిషన్ ఆదేశించాలి. ఉల్లంఘనలను గుర్తిస్తే విద్యార్థి ఫీజుకి రెట్టింపు మొత్తాన్ని యాజమాన్యం చెల్లించాల్సి ఉంటుంది. మొదటి నేరంగా రూ.5 లక్షలు, రెండో నేరంగా రూ. 10 లక్షల వరకు జరిమానా విధించాలి. ఆ తర్వాత కూడా ఉల్లంఘనలు కొనసాగితే అనుమతులు రద్దు చేయాలి.

**మధ్యాహ్న భోజన పథకంపై..**

☞ వారానికి 4 రోజులు కోడిగుడ్లు, రెండు రోజులు అరటి పండ్లు ఇవ్వాలి.

☞ ప్రస్తుతం1 – 5 తరగతులవారికి ఒక్కొక్కరికి ఇస్తున్న రూ. 8. 69 ధరను రూ. 13. 45 కి పెంచాలి. 6 – 8 తరగతులవారికి రూ. 11. 79 నుంచి రూ. 18. 60 లకు, 9 , 10 తరగతులవారికి రూ. 11. 79 నుంచి రూ. 19. 14 లకు పెంచాలి. దానివల్ల ప్రభుత్వంపై ఏడాదికి రూ. 151 కోట్ల అదనపు భారం పడుతుంది.

☞ ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలి. ఇందుకు ఏటా రూ. 39 కోట్ల వ్యయమవుతుంది. మధ్యాహ్న భోజనానికీ ముఖ గుర్తింపు హాజరు (FRS) అమలు చేయాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు వారానికోసారి బిల్లులు చెల్లించాలి. ప్రతి పాఠశాలలో డైనింగ్ హాలు నిర్మించాలి.

**విద్యలో మార్పులు:**

☞ ప్రతి మండలంలో నర్సరీ నుంచి 2 వ తరగతి వరకు ఉండే నాలుగు తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లు (TFS), నర్సరీ నుండి ఇంటర్ వరకు విద్యానందించే మూడు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు (TPS) ఏర్పాటు చేయాలి. వాటిలో ఇంగ్లిష్ మాధ్యమంలో బోధించాలి.

☞ ప్రతి ఫౌండేషన్ స్కూల్ లో AI ల్యాబ్ ఉండాలి.

☞ విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం ఉన్న పాఠశాలల్ని మూసివేయకూడదు. అయితే, ఒకే ప్రాంగణంలో ఉన్నవాటిని ఒకే బడిగా విలీనం చేయాలి.

☞ ఒక గ్రామంలో జూనియర్ కాలేజీ ఉంటే, అదేచోట ఉన్న ఉన్నత పాఠశాలలను కళాశాలకు అనుసంధానం చేయాలి. దానివల్ల పిల్లలు పదో తరగతి తర్వాత చదువు మానేయకుండా ఇంటర్ లోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా ఏకీకృత విధానం కోసం ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆరేళ్ల వయసు నిండాలన్న నిబంధనను TPS , TFS లలో అమలు చేయాలి.

☞ TPS, TFS లలో విద్యాప్రమాణలను నిర్దేశించటానికి, వాటి అమలును పర్యవేక్షించడానికి తెలంగాణ స్కూల్ స్టాండర్డ్స్ అథారిటీ ఏర్పాటు చేయాలి. ✷

# ఎన్నాళ్లో వేచిన ఉదయం అందరం ఇలా కలిశాం!

## లోక్‌సత్తా మిత్రుల ఆత్మీయ సమ్మేళనం




1997 ఆగస్టు 3న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భవించింది. "ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల కోసం ఆవిర్భవించిన ప్రజా స్వామ్య ఉద్యమం" అనే ఉప శీర్షికతో ప్రాచుర్యంలోకి వచ్చింది. దేశంలోని ప్రజాస్వామ్య ఉద్యమాలకు తల మానికమై, రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల ఉద్యమంగా అమితంగా ప్రభావం చూపించింది. "ప్రజలే ప్రభువులు-పాలకులు సేవకులే" అంటూ నినదించిన పౌర ప్రజాస్వామ్య ఉద్యమం లోక్‌సత్తా. పౌరుడు కేంద్రంగా పాలన సాగాలని నినదించిన ఉద్యమసంస్థ లోక్‌సత్తా!

ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో కూడా పౌరసమాజ ఉద్యమ సంస్థగా తనదైన ముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో క్రియాశీల పౌరసమాజ ఉద్యమ నిర్మాణానికి గట్టి కృషి చేసింది!

లోక్‌సత్తాకు ఇప్పటికీ తనదైన బ్రాండ్ ఇమేజ్ ఉంది. అందుకు లోక్‌సత్తా ఉద్యమ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అందించిన స్ఫూర్తి అత్యంత కీలకమైనది! ఆయనతో కలిసి సహచరులుగా పనిచేసిన మేధావులు, ప్రజా ఉద్యమాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విశ్రాంత అధికారులు, ఉద్యోగులు, కళాకారులు, సాగించిన కృషితో లోక్‌సత్తా రాష్ట్రంలోనే ఒక పెద్ద పౌర సమాజ సంస్థగా, ప్రజాస్వామ్య ఉద్యమంగా రూపుదిద్దుకున్నది.

లోక్‌సత్తా సంస్థలోనూ, ఆ తర్వాత పార్టీలోనూ రెండున్నర దశాబ్దాలుగా పనిచేసిన లోక్‌సత్తా మిత్రుల ఆత్మీయ సమావేశం జరపాలన్న ఆలోచన డీవీవీఎస్ వర్మ గారిది. సమావేశాన్ని తణుకులోనే నిర్వహించడానికి సూత్రధారిగా ముందుకు వచ్చారు.

లోక్‌సత్తా ఉద్యమంలో తనదైన రీతిలో విభిన్నమైన ఉద్యమాలు రూపొందించి మనబోటి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసి "దారి దీపం" చూపిన అరుదైన వ్యక్తి వర్మ గారు. ఉద్యమ సంస్థ ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమన్వయ కర్తగా, పార్టీ అధ్యక్షుడిగా దండలో దారం లాగా లోక్‌సత్తా ఉద్యమకారులను ఒక తాటిమీద నిలిపి పనిచేయించిన ప్రజా స్వామ్య "పని రాక్షసుడు" వర్మ గారు. వారి అంతరంగంలో నుంచి వెలువడిన ఆలోచన మార్చి 16 న "లోక్‌సత్తా మిత్రుల ఆత్మీయ సమ్మేళనం" రూపంలో ఆచరణలోకి వచ్చింది. 2025 మార్చి 16న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో లోక్‌సత్తా మిత్రుల ఆత్మీయ సమ్మేళనం అత్యుత్సాహపూరిత

వాతావరణంలో జరిగింది.

రెండు నెలల ముందు నుంచి ఎదురుచూసిన "ఎన్నాళ్లో వేచిన ఉదయం" రానే వచ్చింది. మార్చి 16 ఆదివారం లోక్‌సత్తా మిత్రుల ఆత్మీయ సమ్మేళనానికి తణుకు లయన్స్ క్లబ్ సభా మందిరం ప్రాంగణంలోకి ఒక్కొక్కరుగా విచ్చేస్తున్నారు. ముందు రోజు రాత్రికే కొందరు చేరుకున్నారు. జ్ఞాపకాలతో, ఆత్మీయ పలకరింపులతో చాలా రోజుల తర్వాత కలిసిన చిరకాల మిత్రుల ఆలింగనాలతో ఆనంద హేల నాట్యమాడింది. ఆ అపురూప సన్నివేశం చూసేవారికి కన్నుల పండుగ గానూ చూడని వారికి పరోక్ష ప్రేరణగానూ మారింది.

సమావేశం కోసం వర్మగారు ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో మిత్రులు పెట్టిన ఫోటోలు, వీడియోలు చూసిన వారికి ప్రత్యక్షంగా తాము పాల్గొన లేకపోయినా ఆ అనుభూతిని పరోక్షంగా ఇచ్చాయి. అయ్యో మేము ఈ సమావేశానికి రాలేకపోయామన్న భావన పలువురికి కలిగించింది.

ఈ ఆత్మీయ సమ్మేళనం గురించి ఎవరికి వారే ఏవేవో ఊహించుకున్నారు. కానీ సమ్మేళనం నిర్వహించిన వర్మ గారికి దీని పరిధి గురించిన గట్టి స్పష్టత ఉంది. సమ్మేళనం విషయమై గత రెండు నెలలుగా వారితో సంప్రదింపులలో ఉన్న వారికి ఎలాంటి శషభిషలు, అనుమానాలు లేవు.

లోక్‌సత్తా ఉద్యమకారులకు వర్మ గారు ఇచ్చిన దిశానిర్దేశం చూపిన "దారి దీపం"అలాంటిది. అయితే ఆత్మీయ సమ్మేళనం పై అతి అంచనాలతో, అత్యాశతో వచ్చిన వారు కొంత అసంతృప్తి పొందినమాట నిజమే. ఉద్యమసంస్థని , లేదా పార్టీని క్రియాశీలం చేసే కార్యాచరణ ప్రణాళికను వర్మగారు రూపొందిస్తారని కొందరు ఆశించారు. అయితే ఈ విషయమై వర్మగారు ముందే వివరంగా చెప్పారు. లోక్‌సత్తా ఉద్యమ సహచరుల ఆత్మీయ సమ్మేళనం మాత్రమేనని, సంస్థాగత అంశాలు ఇక్కడ ప్రస్తావించవద్దని, వాటిని ఆయా వేదికలపై మాట్లాడుకోవాలని విజ్ఞప్తి చేశారు!

దాంతో అచ్చంగా ఆత్మీయ సమ్మేళనం ఆత్మీయులను కలుసు కునే కార్యక్రమంగానే జరగడం చాలా మందికి తృప్తినిచ్చింది. రెండు నెలల ముందుగానే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు "లోక్ సత్తా ఆత్మీయ సమ్మేళనం" పేరు మీద ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ఆయన ఆహ్వానించారు. కొందరికి ఆయనే స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. ఆ తర్వాత వర్మ గారి జీవిత సహచరి, విద్యావేత్త, లోక్‌సత్తా ఉద్యమసంస్థ వేదిక ద్వారా ఎందరికో ప్రేరణ ఇచ్చిన సంకు మనోరమ గారు కూడా మహిళా మిత్రులను, దీర్ఘకాలం పనిచేసిన చాలామందినీ స్వయంగా ఆహ్వానించడంతో ఈ సమ్మేళనానికి వచ్చే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగింది. మొదట 30, 40 మందితో అనుకున్న ఈ సమ్మేళనం మెల్ల మెల్లగా సెంచరీకి చేరుకుంది.

ఏదైతేనేం సుమారు 10,12 సంవత్సరాల నుంచి కలవని లోక్‌సత్తా మిత్రులు కూడా ఒకసారి వర్మ గారి దంపతులను చూసి పోదామని లేక ఆ సమావేశానికి వచ్చే వారిని అందరిని
















పలకరిద్దామని వచ్చారు. మేము లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో పని చేశామని సగర్వంగా తృప్తిగా మరొకసారి చాటి చెప్పడానికి ఈ సమావేశం ఎంతగానో ఉపయోగపడింది.

**మొదటి బృందం ప్రయాణం ఇలా మొదలైంది!**

మార్చి15 ఉదయం 6 గంటలకల్లా నాతో పాటు ఉద్యమ సంస్థలో మొదట్లో బాగా పనిచేసిన మా సోదరుడు బండారు రామఫణిధర్‌రావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో మెదక్ జిల్లాలో త్రిమూర్తులు అనిపించుకున్న నేనూ, లోక్‌సత్తా సహచరులు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, డాక్టర్ ఏ రంగాచారి. అలాగే లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నిర్వహించిన సమావేశాలకు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా తనకున్న నెట్వర్క్‌తో హైదరాబాదులో జరిగే సభలు సమావేశాలకు క్రౌడ్ పుల్లింగ్ మ్యాన్ లోక్‌సత్తా ఉద్యమ సంస్థతో మమేకమై ఆ తర్వాత పార్టీలో కూడా చాలా బాధ్యతలు నిర్వహించిన, లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, మరొక ముఖ్య నాయకులు ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్‌కు సంబంధించిన హైదరాబాదులోని కొత్తపేట శిక్షణ శిబిరానికి నాయకత్వం వహించి ఆ శిక్షణలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన పి. భాస్కరరావు ఇలా ఆరుగురం సికింద్రాబాద్ స్టేషన్‌లో కలిసాం. తణుకుకు మొదటి బృందంగా బయలు దేరాము. మా ఆరుగురి ఫోటోలు గ్రూపులో పెట్టగానే తణుకు బయలుదేరిన మిత్రులంతా ఒకరి తర్వాత మరొకరు తమ ప్రయాణాల గురించిన మెసేజులను, ఫోటోలను, వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడం ప్రారంభించారు.

సికింద్రాబాద్‌కు చెందిన అల్వాల శ్రీనివాస వర్మ, కూకట్ పల్లికి చెందిన వంశీ హైదరాబాదు నుంచి కారులో బయలుదేరారు.



మేము కూడా తాడేపల్లిగూడెంలో ట్రైన్ దిగి అక్కడి నుండి రోడ్డు మార్గంలో తణుకు చేరుకున్నాం.

మా రాక విషయం తెలిసి వర్మగారు, అప్పటికే తణుకు చేరుకున్న మిత్రుడు కార్తీక్ చంద్ర లయన్స్ భవన్ వద్ద మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. మర్నాడు జరగాల్సిన సమావేశ వివరాలు వెల్లడిస్తూ వాటికి సంబంధించిన అంశాలను మా ముందు ఉంచారు. ఆ విషయాలను చర్చిస్తున్న సమయంలోనే పద్మ భూపతిరాజు, దాట్లలక్ష్మి కూడా ఆత్మీయ కలయికలో చేరిపోయారు.

చాలా జిల్లాల నుండి ఉద్యమ సహ చరులు తణుకు చేరుకుంటున్న సమాచారం వచ్చిపడుతోంది.

ఉదయాన్నే నేను మనోరమ గారి దగ్గరికి వెళ్లి ఆమెను కలిసిన తర్వాత, వారి ఆత్మీయ పలకరింపుతోనే మనసు కుదుటపడింది. అప్పటికే మనోరమ గారి ఇంటిలో హైదరాబాదు నుండి మహిళాసత్తా నాయకురాలు నందూరి సరోజాదేవి , సికింద్రాబాద్‌లో పార్టీ కార్యకలాపాలను తనమీద వేసుకుని నడిపించిన ఆకుల మహారాణి ఉన్నారు. అంతకు ముందు కూడా వారు మనోరమ గారి ఇంట్లో వారి ఆతిథ్యం తీసుకుని ఉన్నవారే.

మనోరమ గారి ఇంట్లో మేమంతా చిలో పోలో మంటూ గలగలా మాట్లాడుకుంటూ ఉండగానే జనబలం మాసపత్రిక వర్కింగ్ ఎడిటర్ దూసనపూడి సోమసుందర్ తాడేపల్లిగూడెం నుండి అక్కడికి చేరుకున్నారు. భుజాన వేలాడుతున్న ఎర్ర సంచితో సోమసుందర్ వస్తుంటే నడిచే ఎర్రబావుటా మాదిరిగా కనిపించారు.

లోక్‌సత్తా ఉద్యమసంస్థ కాలం నుంచి విజయనగరం కేంద్రంగా పనిచేస్తూ , ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న భీశెట్టిబాబ్జి, వైజాగ్ మిత్రులు వేణు గోపాలరావు 15వ తేదీ అర్ధరాత్రి తణుకు లయన్స్ భవనానికి చేరుకున్నారు.

16వ తేదీ ఉదయం ఒక్కరొక్కరుగా, బృందాలుగా లయన్స్ భవన్‌కు చేరుకుంటూనే ఉన్నారు. హైదరాబాద్ బిర్లా సైన్స్ ఆడిటోరియంలో 1997 ఆగస్టు 3న జరిగిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భావ సదస్సు నుండి జేపీ గారితో కలసి నడిచిన, నడుస్తున్న లోక్‌సత్తా భీష్మాచార్యుడిగా పేరొందిన పర్చా కోదండ





రామారావు, డాక్టర్ అంజనీ దేవి దంపతులు , అలాగే లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భావ కాలం నుంచి పని చేసిన , ఇప్పటికీ పని చేస్తున్న తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన డాక్టర్ పాలడుగు చంద్రమౌళి, ప్రముఖ హేతువాది, సంఘ సేవకులు సిద్ధార్థ్ బక్ష్, ప్రముఖ రచయిత్రి విజయలక్ష్మి బక్ష్ దంపతులు హాజరయ్యారు.

ఉద్యమ సంస్థ కాలం నుండి అకుంఠిత దీక్షతో పని చేసిన కటారి శ్రీనివాసరావు హైదరాబాద్ నుండి వచ్చి హుషారుగా అందర్నీ పలుకరిస్తూ కలయతిరగడం కనిపించింది. "జుగాడ్" ఓటర్ల ఉద్యమ సృష్టికర్త పార్థసారథి గలగలా నవ్వుతూ వచ్చారు. వయసు రీత్యా ఏర్పడిన సమస్యలతో ఆరోగ్యం బాగా లేకున్నా అందరినీ కలవాలన్న ఆశతో పార్థసారథి హైదరాబాదు నుంచి కారులో సుదీర్ఘ ప్రయాణం చేసి వచ్చారు.

లోక్‌సత్తా ఉద్యమ కార్యకలాపాలకు ప్రేరణ ఇచ్చిన, కార్యదక్షత కలిగిన యువ నాయకుడు శిరమని నరేష్ తన ఉద్యోగరీత్యా ప్రస్తుతం చిత్తూరు జిల్లా కుప్పంలో ఉంటున్నప్పటికీ అంత దూరం నుంచి ప్రయాణం చేసి వచ్చారు. యువసత్తా నాయకుడు శివరామకృష్ణ , విజయనగరం నుండి అనంతలక్ష్మి, శ్రీకాకుళం నుండి ప్రొఫెసర్ డాక్టర్ విష్ణుమూర్తి, బుడుమూరు సూర్యారావు, కర్నూల్ నుంచి రాజ్యలక్ష్మి, ఎమ్మిగనూరు నుంచి న్యాయవాది వసంత్ కుమార్, మనసులో ఏది ఉంచుకోకుండా ఉన్నది ఉన్నట్టుగా కడిగిపారేసే కర్నూలు యువ నాయకుడు డేవిడ్, నెల్లూరు నుండి నర్రా శ్రీధర్, మహమ్మద్ రఫీ, ఒంగోలు నుండి రత్నకుమారి, చిలకలూరిపేట నుండి న్యాయవాది భాను ప్రసాద్, వినుకొండ నుండి జె ఐరామ్మూర్తి, గుంటూరు నుండి పద్మరాణి, పాల్వంచ నుండి చారుగుండ్ల వెంకటేశ్వర్లు, రాజమహేంద్రవరం నుండి రామచంద్రమూర్తి, యువనాయకుడు జె.రవి, విజయవాడ నుండి యువ న్యాయవాది శాంతిరెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా నుండి విద్యార్థి నాయకుడు రాజీవ్, గుంటూరు నుంచి వచ్చిన వీరశేఖరరావు , తూర్పు గోదావరి జిల్లాలో లోక్‌సత్తాకు బ్రాండ్‌గా నిలిచిన అమలాపురం ప్రొఫెసర్ డా. ఇ.ఆర్.సుబ్రహ్మణ్యం, పశ్చిమ గోదావరి జిల్లాలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో కీలకంగా పనిచేసి ప్రస్తుతం మానవత స్వచ్ఛంద సంస్థలో కీలక బాధ్యతల్లో ఉన్న సాగిరాజు జానకిరామ రాజు, వర్మగారి బాల్య మిత్రులు లోక్‌సత్తా సహచరులు మొగళ్ళపు వెంకటేశ్వరరావు, తణుకులో లోక్‌సత్తా తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన డా.వి.సుబ్బలక్ష్మి , లోక్‌సత్తా కేంద్ర కార్యాలయంలో సహాయకునిగా సేవలు అందించిన యువకుడు గౌతమ్ ఇలా ఒక్కొక్కరు పేరూ చెబితే 100 పేర్లు దాటతాయి.

తెలంగాణ, రాయలసీమ , కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలలోని అన్ని జిల్లాల నుండి ఆత్మీయ సహచరులు అలా వస్తూనే ఉన్నారు. ఉదయం 10 గంటలకల్లా ఆ సమావేశానికి వచ్చిన వారి సంఖ్య 100కు చేరుకుంది.

సరిగ్గా 10 గంటలకు సమావేశం మొదలైంది. "ఏమివ్వగలను నేను ఆత్మీయ ఆలింగనం తప్ప" అంటూ వర్మ గారు లాంఛనంగా సమ్మేళనాన్ని ప్రారంభించారు. అందర్నీ పేరు పేరునా పలకరించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త కటారి శ్రీనివాసరావు, పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్‌ను వేదిక మీదికి ఆహ్వానించారు.

గత పాతికేళ్ళుగా ఉద్యమసంస్థలో, ఆ తర్వాత పార్టీలో పని చేసిన సుమారు 50 మందికి పైగా ఈ మధ్య కాలంలో మృతి చెందారు. పేరు పేరునా వారి సేవలను గుర్తు చేసుకుంటూ సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది.

సభికులందరి స్వీయపరిచయాలు క్లుప్తంగా జరిగాయి. ఆ తర్వాత గత పాతికేళ్ళుగా పనిచేస్తున్న సీనియర్ సభ్యులతో పాటు ప్రధానమైన బాధ్యతలను తీసుకున్న కొందరికి సన్మానాలు జరిగాయి. పాత ఆత్మీయ మిత్రులు కలవగానే ఎవరికి వారే ఫోటోల సందడి చేశారు. ఎక్కడికి అక్కడ అనుభవాలను నెమరు వేసుకున్నారు. సెల్‌ఫోన్ కెమెరాల్లో ఆత్మీయ ఆలింగనాలను బంధించారు.

పెద్ద సంఖ్యలో క్రియాశీల ఉద్యమకారులు ఒక చోటకు చేరినందున లోక్‌సత్తా అజెండా అంశాలపై బృంద చర్చలు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు మిత్రులు సూచించారు.

దానికి వర్మగారు సుముఖత వ్యక్తం చేయడమే కాకుండా మిత్రులతో మాట్లాడి చర్చనీయ అంశాలను ఖరారు చేశారు. సమాజ హితం కోసం ఆలోచించే బృందాలను ఏర్పాటు చేసి ఒక్కొక్క గ్రూప్‌కి ఒక్కొక్క అంశాన్ని కేటాయించి దానికి ఆసక్తి కలవారినే ఆ గ్రూపులో చేరమని వర్మ గారు కోరారు. బృందా





లకు ఒక గంట సమయం ఇచ్చి గ్రూపు చర్చలో తేలిన అంశాలను భోజన విరామం తర్వాత మొత్తం సమ్మేళనంలో అందరికీ వివరించాలని కోరారు.

పశ్చిమగోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కార్మికనేతగా , న్యాయవాదిగా, రచయితగా పేరు పొందిన ప్రముఖులు, కార్మిక సమస్యలపై అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు కీర్తిశేషులు కలిదిండి భీమరాజు గారి జయంతి సందర్భంగా వారి కుమార్తె సుశీల, అల్లుడు ఎన్. వేణుగోపాల కృష్ణంరాజు సమ్మేళనానికి హాజరైన మిత్రులకు ఆతిథ్యం ఇచ్చారు.

సమావేశ మందిరానికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్న వారి ఇంటిలో షడ్రసోపేతమైన విందును ఏర్పాటు చేసారు. గోదావరి జిల్లాల ఆదరణను, ఆతిథ్యాన్ని అందరూ సంతోషంగా ఆస్వాదించారు.

**ఆదర్శ కార్మికనేత**
**కలిదిండి భీమరాజు జయంతి!**

పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు కేంద్రంగా కీ.శే. కలిదిండి భీమరాజు గారు దశాబ్దాల తరబడి నీతి నిజాయితీలతో కార్మికోద్యమానికి నేతృత్వం వహించారు. వారి తదనంతరం వర్మ గారు పశ్చిమగోదావరి జిల్లా కార్మిక ఉద్యమానికి సేవలు అందించారు. ప్రస్తుతం కూడా తణుకు కేంద్రంగా వర్మ గారు అదే పనిలో ఉన్నారు.

భోజనానంతరం అందరూ లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో తిరిగి సమావేశం అయ్యారు. కలిదిండి భీమరాజు జయంతి సభ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలిదిండి భీమరాజు గారి ఉద్యమ వారసుడిగా వర్మ గారు సభకు అధ్యక్షత వహించారు. భీమరాజు గారి జీవిత విశేషాలను, కార్మికోద్యమంలో వారు సృష్టించిన నూతన సంస్కృతిని, ప్రత్యేకతలను వర్మగారు వివరించడంతో భీమరాజు గారి ఆదర్శ ప్రాయమైన ట్రేడ్ యూనియన్ సంస్కృతి గురించి



అందరికీ తెలుసుకునే అవకాశం దొరికింది.

భీమరాజు గారు స్థాపించిన కొన్ని కార్మిక సంఘాలకు ప్రస్తుతం సారథ్యం వహిస్తున్న సీనియర్ పాత్రికేయుడు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి, "జనబలం" వర్కింగ్ ఎడిటర్ దూసనపూడి సోమసుందర్ "రాజ్యాంగం – ప్రజాస్వామ్యం – సాంస్కృతిక సమస్యలు" అంశంపై ప్రసంగించారు. ఖమ్మం నుండి వచ్చిన మిత్రులు పి. రవిమారుత్ "రాజ్యాంగం –ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాలు" అంశంపై ప్రసంగించారు.

**మహిళా నాయకుల సందడి!**

అభినందన సత్కారాలతో ఆత్మీయ సమ్మేళనం నిండుగా కనిపించింది. సమావేశానికి వచ్చిన సుమారు 20 మందికి పైగా మహిళా నాయకులను చీర, సారె, శాలువా, జ్ఞాపికతో సంకు మనోరమ సత్కరించారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ లోక్‌సత్తా ఉద్యమంలో తమ మధ్య ఏర్పడిన అనుబంధం సొంత బంధుత్వాల కంటే బలమైనదనీ, ప్రజల కోసం ఏదో రూపంలో పని చేయాలన్న కృత నిశ్చయాన్ని వ్యక్తం చేశారు.

ఉదయం జరిగిన బృంద చర్చల సారాంశాన్ని సమన్వయకర్తలు వివరించారు. లోక్ సత్తా కోరుకున్న సంస్కరణల కోసం హాజరైన ప్రతీ ఒక్కరూ తమకు వీలైన పద్ధతిలో కృషి సాగించాలని వక్తలు కోరారు. సాయంత్రం 6 గంటల దాకా ఆద్యంతం ఉత్సాహంగా ఉల్లాసంగా సాగిన ఈ కార్యక్రమం ఉద్యమ సహచరుల్లో నూతన ఉత్తేజాన్ని తెచ్చిందని డాక్టర్ పాలడుగు చంద్ర మౌళి అన్నారు.

తాజా జ్ఞాపకాలతో విడిపోతున్నాం మళ్లీ ఎప్పుడు కలుస్తామో అన్న భారమైన హృదయాలతో ఆత్మీయ సమ్మేళనం ముగిసింది. లోక్‌సత్తా ఆత్మీయ సమ్మేళనం నిర్వహణకు పూనుకొని అందరినీ ఆహ్వానించి వారితో ఒకరోజు గడపడానికి సూత్రధారిగా వ్యవహరించిన డివివిఎస్ వర్మ గారికి అందరూ నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక కార్యాచరణకు వస్తే మనం కలవడమే ఒక కార్యాచరణ అనే భావం అందరి మనసులో మెదిలింది. ఏదో ఒక పనిలో నిమగ్నం కావాలన్న ఉత్తేజాన్ని కల్పించడంలో తణుకు సమ్మేళనం విజయవంతంగా ముగిసింది.

– బండారు రామ్మోహనరావు

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

Jugaad Bharat
United Voters

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

Jugaad Bharat United Voters
Simplifying Democracy - Strengthening Unity
**స్వజాతీయ నమూనా మార్పు** - Model Political System

"ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనంచేసి, అప్రజాస్వామికంగా నిరంకుశంగా వ్యక్తుల ఇష్టానుసారంగా నడిచే పార్టీలలో ఏ పార్టీ గెలిచినా ఓడిపోయేది ప్రజలే, కాబట్టి పార్టీలనూ రాజకీయాలనూ చట్టబద్ధంగా ప్రజాస్వామికీకరణం చేయడం అతి ముఖ్యమైన అంశం.." అన్నది జగమెరిగిన సత్యం. సుపరిపాలన జుగాడ్ ఓటర్ల జన్మహక్కు!

ఈమధ్య ఒక ఢిల్లీ హైకోర్టు జడ్జి గారి ఇంట్లో కోట్ల నోట్ల కట్టలు "అగ్ని"సాక్షిగా బయటపడ్డాయి. ఇంకోచోట ఒక లారీ చెట్టుకి గుద్దుకుని బోల్తాకొడితే, అందులో రవాణా అవుతున్న అక్రమ మద్యం బాటిళ్ల భాగోతం. ఇలా ఎన్నో ఉదంతాలు. ఈ వ్యవస్థీకృత అవినీతి వ్యవహారాల నుండి బయటపడే మార్గమే లేదా ?! ఉంది. అదే జుగాడ్ ఓటర్ల 50 50 రాజనీతితో కూడిన ద్విపక్ష రాజకీయ పార్టీ! ఈ ప్రతిపాదిత పార్టీలో ఓటర్లే ప్రభువులు. అభ్యుదయ భావాలు కలిగిన ప్రజాస్వామ్య వాదులంతా భారతదేశంలో ఎక్కడున్నా జుగాడ్‌ఓటర్లుగా నమోదు కావచ్చు

## Cooperation based on trust - Jugaad Voters Government!

**(నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం)**

**MLA నియోజకవర్గం ప్రాతిపదికగా జుగాడ్ ద్విపక్ష పార్టీకి అంకురార్పణ.**

పార్టీ పెట్టి నిజాయితీగా, సక్రమంగా నడపాలంటే డబ్బు కావాలి. నేనైనా, మీరైనా మనలని ఓటర్లు నమ్మి-ఇచ్చిన-డబ్బుని మన ప్రయోజనానికి వాడుకోకూడదు. పార్టీ కార్యకర్తగా జీవితంలో ఒకేసారి రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. లేనిపక్షంలో జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 2,000 కానీ ఇచ్చి, పార్టీకి మద్దతివ్వండి! ఓటర్లే అవినీతిలేని-పార్టీ నిర్మించుకుని క్రమశిక్షణతో అత్యంత పారదర్శకంగా నిర్వహించుకోవాలి. పదవులకోసం కీచులాడుకోకూడదు. చట్టబద్ధపాలన, అధికార-వికేంద్రీకరణ, ఆర్థిక-వికేంద్రీకరణ పార్టీలోనే ఖచ్చితంగా చేసి చూపిద్దాం.

నేడు ఆంధ్రప్రదేశ్ లోని ఒక పత్రికావిలేకరి అంతరాత్మ ఘోష: "సంక్షేమపథకాల ముసుగులో పాలకులు పడేసే ఎంగిలి మెతుకులకు ఆశపడకు.. రేపటి తరాల జీవితాలను బాగుచేసే దిశగా అడుగులువేయడం ప్రారంభించు..ఓటు అడగడానికి వచ్చేవారికి నువ్వే షరతులు విధించే స్థాయికిఎదుగు...నీకు నువ్వుగా నిబద్ధత అలవాటు చేసుకో..ఇదంతా సాధ్యమయ్యేదేనా అని సందేహించకు.. శాంతియుతంగా స్వరాజ్యమే సాధించాం..సురాజ్యం ఎందుకు రాదు !!"

**శ్రీ విశ్వావసు నామసంవత్సర ఉగాది శుభాకాంక్షలు**

Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) Your MLA Constituency name (2) your name and gender (3) your age (4) Your Voter ID 5) Cell No:

advt

# లోక్‌సత్తా అజెండాను చర్చనీయాంశం చేయాలి!




లోక్‌సత్తా భావజాలం ప్రజలకు, సమాజానికి అవసరమైనది, బలమైనది, ఇప్పటికీ ప్రాసంగికత కలిగినది, దానిగురించి నిరంతరం చర్చ జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత మనపై ఉంది అంటూ పలువురు మిత్రులు అభిప్రాయపడ్డారు.

మార్చి 16న తణుకులో జరిగిన "లోక్‌సత్తా మిత్రుల సమ్మేళనం" లో జరిగిన బృందచర్చల్లో భాగంగా మూడో బృందం "రాజ్యాంగం, ఎన్నికలు, ప్రజాస్వామ్య సంస్కరణలు" అంశంపై చర్చించింది. చర్చను ఎస్. మనోరమ ప్రారంభించారు.

జాతీయోద్యమ కాలంలో ప్రజల సమష్టి భావనలను, ఆకాంక్షలను, ఆశయాలను దృష్టిలో ఉంచుకుని భారత రాజ్యాంగ రచనా ప్రక్రియ సాగిందని మనోరమ గుర్తు చేశారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సామ్యవాదం, వంటి ఉదాత్త లక్ష్యాలతో రూపొందిందని, అటువంటి లక్ష్యాలను సాధించడమే మన కర్తవ్యమని మనోరమ చెప్పారు. భారత రాజ్యాంగ మౌలిక చట్రాన్ని మార్చేందుకు ఎలాంటి ప్రయత్నం జరిగినా దేశం నష్టపోతుందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడం పౌరుల బాధ్యత అని మనోరమ చెప్పారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాలు పూర్తవు తున్న సందర్భంలో "రాజ్యాంగ ప్రచార వేదిక" ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలో తాము చేపట్టిన ప్రచారోద్యమానికి విశేష స్పందన లభించిందని ఆమె వివరించారు. సామూ హికంగా రాజ్యాంగ ప్రవేశికను పఠించే కార్యక్రమంలో ఒక్క తణుకులోనే ముప్పై వేలమంది పాల్గోవడం విశేషమని ఆమె తెలిపారు. బలమైన భావజాలం ఉన్నపుడు స్థానిక స్థాయిలో బృందాలుగానూ, వ్యక్తులుగానూ కూడా మనం పనిచేయ వచ్చని ఈ ఉదంతం రుజువు చేసిందని చెప్పారు. లోక్‌సత్తా మిత్రులు తమకు వీలైన పద్ధతిలో తమ తమ స్థానిక సమాజాల్లో పనిచేయాలని కోరారు.

జే. ఐరామ్మూర్తి మాట్లాడుతూ త్వరలో ఆంధ్రప్రదేశ్ లో స్థానిక ఎన్నికలు రానున్నాయని ఈ అవకాశాన్ని లోక్ సత్తా మిత్రులు వినియోగించుకోవాలని సూచించారు. ధన , కుల , మద్యం , ఓట్ల కొనుగోలు రాజకీయాలపై ప్రజల్లో ఏహ్యత ఉందని, అయితే సరైన ప్రత్యామ్నాయం లేకనే తాత్కాలిక తాయిలాల వలలో పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పాలనలో తేడా ఉండటం లేదని, అటూ ఇటూ పార్టీలు మారే నాయకులు తమ స్వార్థానికి అధికారాన్ని వాడుకుంటున్నారని అన్నారు. ప్రజలు వీటి గురించి మాట్లాడుకుంటున్నారని అన్నారు. స్థానిక ప్రభుత్వాల అధికారాల గురించి గట్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు తమను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన రాజకీయంపై అసంతృప్తిగానే ఉన్నారని అన్నారు.

లోక్‌సత్తా మిత్రులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి స్థానిక ప్రభుత్వాల అధికారాలు, పౌర సేవలు, అవినీతి వంటి అజెండా అంశాలపై ప్రచారం చేయాలని పిలుపు నిచ్చారు. తాను మరోసారి సర్పంచ్ గా పోటీ చేస్తానని, అందుకోసం నిత్యం అజెండాను చర్చలో ఉంచే కృషి చేస్తున్నానని అన్నారు.

పద్మరాణి మాట్లాడుతూ విద్యాపరంగా వెనుకబడిన కుటుం బాల పిల్లలకు విద్య అందించేందుకు తాను వ్యక్తిగతంగా సాగిస్తున్న కృషి గురించి వివరించారు. విద్యా రంగంలో ప్రమాణాలు పెంచడానికి జరిగే ప్రయత్నాలకు తల్లి తండ్రుల నుండి మద్దతు లభిస్తున్నదనీ పద్మరాణి చెప్పారు.

లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ లోక్ సత్తా భావజాలానికి ప్రాసంగికత ఉందని, కీలక అంశాలపై మన అభిప్రాయం కోసం ప్రజలు అడుగుతూ ఉంటారని చెప్పారు. పార్టీ పరంగా తాము ఉన్నంతలో లోకసత్తా వాణిని వినిపిం చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలను తెస్తున్నా ప్రజల జీవితాల్లో మౌలిక మార్పులు రావడం లేదన్న భావన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. భావి తరాలకు మంచి రాజకీయాలను పరిచయం చేయడానికి కృషి జరగాలని అన్నారు. తమకు వీలున్న విద్యా సంస్థలలో ప్రచార కార్యక్రమాలకు ప్రయత్నం చేస్తానని అన్నారు.

మహారాణి మాట్లాడుతూ స్థానిక సమూహాలలో పౌర సేవల

బృందాలుగా, వ్యక్తులుగా లోక్‌సత్తా ఆశయాల సాధనకు కృషి చేయడం ఎలా అనే అంశం మీద ఏర్పడిన బృందానికి సమన్వయకర్తగా బండారు రామ్మోహనరావు వ్యవహరించారు. వ్యక్తిగతంగా కానీ, ఉద్యమపరంగా కానీ చిన్న చిన్న ఉద్యమాలకు రూపకల్పన చేసి ప్రజా బాహుళ్యంలోకి మళ్లీ లోక్‌సత్తా దూసుకుపోవడానికి ఈ సమావేశం మరింత దోహదపడుతుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన తరానికి లోక్‌సత్తా భావజాల బలాన్ని వివరించే ప్రక్రియ వ్యక్తిగతంగా కూడా చిన్నచిన్న కార్యక్రమాల ద్వారా చేపట్టవచ్చు అని తీర్మానించుకొని సమావేశం ముగించారు.

మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. నగరాల్లో పనిచేయడానికి తగిన వేదికలు ఉన్నాయని వాటిలో మనం పనిచేయవచ్చునని సూచించారు.

డి.వి.వి.ఎస్. వర్మ మాట్లాడుతూ "సమస్యను వర్ణించడం కాదు, పరిష్కారంలో భాగం కావడం" అనే సూత్రం మనకు మార్గదర్శకంగా ఉండాలని, చేయగలిగిన అంశాలపై దృష్టి సారించాలని కోరారు. వ్యక్తిగత స్థాయిలో చేయగలిగే చిన్నపని కూడా మంచి ప్రభావాన్ని చూపుతుందని, విడిచి పెట్టకుండా, నిల కడగా పనిచేయడం ముఖ్యమని అన్నారు.

పి.భాస్కరరావు మాట్లాడుతూ భావజాల ప్రచారానికి సామాజిక మాధ్యమాలు, విద్యాసంస్థలు, కాలనీ అసోసియేషన్లు,స్థానిక ఎన్నికలు మంచి వేదికలనీ, వాస్తవాల ఆధారంగా చేసే ప్రచారానికి ప్రభావం ఉంటుందని అన్నారు. పెరుమాళ్ల రాజు, శాంతిరెడ్డి, వేణుగోపాల్, కే. పార్థసారథి, నరేంద్ర, అనంతలక్ష్మీ తదితరులు మాట్లాడారు. అజెండా అంశాల ప్రచారం కోసం సామాజిక మాధ్యమాలను వినియోగించు కోవచ్చని వారు సూచించారు. అవకాశం ఉన్న సందర్భాలను ఎంపిక చేసుకుని లోక్‌సత్తా భావ జాలాన్ని అంశాలవారీగా చర్చనీయాంశం చేయాలని, వివిధ రంగాల్లో ఇప్పటికే పని చేస్తున్న బృందాలతో సమన్వయం చేసుకుని పని చేయవచ్చునని వారు సూచించారు.

ఈ బృందానికి సమన్వయకర్తగా వ్యవహరించిన డి.సోమసుందర్ మాట్లాడుతూ గత ఇరవయ్యేళ్లుగా ప్రథమ్ సంస్థ నిర్వహిస్తున్న "అసర్"లో కొనసాగుతూ ఉండటం వల్ల విద్యారంగంలో జరుగుతున్న ప్రయోగాలను గమనించడం వీలయ్యిందని అన్నారు. పలు చొరవల్లో భాగస్వామిగా తమ బృందం చేపట్టిన కార్యక్రమాలు కొంతమేరకు ఫలితాలు ఇచ్చాయని చెప్పారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ , లోక్‌సత్తా పార్టీ వంటి నిర్మాణ చట్రం లో భాగంగా ఉన్నవారు సంస్థాగత కార్యక్రమాల్లో చురుగ్గా పని చేయాలని, ప్రస్తుతం వాటిలో భాగంగా లేకున్నా భావజాలంతో సారూప్యం ఉన్నవారు వ్యక్తిగత స్థాయిలో, చిన్న చిన్న బృందా లుగా కూడా పనిచేయ వచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు.

తమందర్నీ "లోక్‌సత్తా మిత్రుల సమ్మేళనం" పేరుతో ఒక వేదిక మీదకు తెచ్చిన వర్మ, మనోరమ దంపతులకు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. బృందంలో దాదాపు 40 మంది పాల్గొన్నారు.



సామాజిక సమస్యలు-వివక్ష- మద్య నియంత్రణ అన్న అంశంపై బృంద చర్చలు నిర్వహించాం.. మా బృందంలో నందిపేట రవీందర్, సాగి జానకిరామరాజు, రిటైర్డ్ న్యాయమూర్తి లక్ష్మి, రాజీవ్, శివరామకృష్ణ మరికొంతమంది మిత్రులు ఈ చర్చలో పాల్గొన్నారు. మద్య నియంత్రణ, లింగ వివక్ష మీద అందరికీ అవగాహన ఉన్న కారణంగా కార్యాచరణ గురించే చర్చ జరిగింది. గతంలో చేసిన పాదయాత్రలు, బెల్టుషాప్ వ్యతిరేక ఉద్యమం, వేలంపాటల నిలుపుదల కార్యక్రమాలు అందరి మనస్సుల్లో మెదిలాయి. ప్రస్తుతం ఏం చేయాలనేదాని గురించి కూడా చర్చించాం. అయితే మత వివక్ష గురించి చర్చలో ఊహించని విధంగా కాస్త ఘాటైన చర్చ జరిగింది. ప్రస్తుతం సమాజంలో ఉన్న మత అసహనం, విద్వేష ప్రసంగాలు, కేవలం ఘర్షణ కోసం కొన్ని అంశాలను గుర్తించి లేవనెత్తడం వంటి అంశాలు చర్చకు వచ్చాకా..ఆశ్చర్యంగా కొంత ప్రతిఘటన కూడా వచ్చింది. ప్రజలకు చరిత్ర తెలియక్కర్లేదా? వాస్తవాలు ఎంత కాలం దాచిపెడతాం వంటి ప్రశ్నలు వచ్చాయి. ముఖ్యంగా గుంటూరు జిన్నా టవర్ అంశం కొంత ఘాటైన చర్చకు దారి తీసింది. ఇవాళ్టి ప్రజల జీవితాలకి, ఆ సెంటర్‌కి, జిన్నా టవర్ అన్న పేరు ఉండటానికి సంబంధం ఏమిటన్న ప్రశ్న మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. అంతిమంగా సమాజంలో వివక్షకు వ్యతిరేకంగా ఆదర్శంగా ఉన్న వ్యక్తులు, కుటుంబాలను గుర్తించి వాళ్ల కార్యక్రమాలకు ప్రచారం కల్పించటం, పదిమంది వాటిని ఆచరించేలా చేయటమే మనం చేయాల్సిన పనిగా గుర్తించాం. అలాగే కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న కుటుంబాలు ఎలా ఉన్నాయి..వాళ్లను ఆదర్శంగా మిగతా వారికి చూపే ప్రయత్నాలు కూడా జరగాలని తీర్మానించాం. చివరిగా ఆచరణలో ఎలా ఉన్నా చాలా కాలం తర్వాత గొప్ప జ్ఞాపకాల్ని మళ్లీ పోగుచేసుకుని వెళ్తున్న అనుభవంతో, అనుభూతితో అందరం తిరుగు ప్రయాణం అయ్యాం. అలాగే క్రమం తప్పకుండా కనీసం సంవత్సరానికి ఒకసారైనా కలవాలని కూడా అనుకున్నాం.

**-కటారి శ్రీనివాసరావు**

# 3.04 లక్షల కోట్లతో తెలంగాణ 2025-26 బడ్జెట్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తి 12 నెలల ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది.

ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం ఆదాయం రూ. 3.04 లక్షల కోట్లలో అత్యధికంగా 34.2% అంటే, రూ. 1,04,329 కోట్లను సంక్షేమ పథకాలకే కేటాయించింది. వీటిలోనూ ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీల అమలుకు సంబంధించిన తొమ్మిది పథకాలకు ఏకంగా రూ. 56,084 కోట్లు దక్కాయి. ప్రస్తుత ఏడాదికి ఇవే గ్యారంటీ హామీలకు రూ. 47,167 కోట్లు కేటాయించగా వచ్చే ఏడాదికి మరో రూ. 8,917 కోట్లు పెంచారు. అభివృద్ధి పథకాలకు ... ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు మూలధన వ్యయం కింద రూ. 36,504 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఆదాయం మొత్తం రూ. 3,04,466.55 కోట్లు ఉంటుందని, అయితే 498.45 కోట్లు అధికంగా వ్యయం ఉంటుందని ప్రభుత్వం వివరించింది. రాష్ట్ర ఆర్థిక ద్రవ్యలోటు రూ. 54,009.74 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. అంటే అంచనా వేసిన వ్యయం కన్నా ఆదాయం రూ. 54,009.74 కోట్లు తక్కువగా వస్తుంది. ఈ ఆర్థిక ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు దాదాపు రూ. 66,639 కోట్లను కొత్త రుణాలుగా సేకరించనుంది. వీటిని కలిపినా నికర లోటు 498.45 కోట్లుగా ఉంటుంది.

➡ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ సరఫరా తదితర ప్రధాన పథకాలకు ప్రభుత్వం నిధులను పెంచింది. గతంలో రైతు భరోసాకు రూ. 15 వేల కోట్లు ఇవ్వగా, వచ్చే ఏడాది రూ. 18వేల కోట్లకు పెంచారు. ఇందిరమ్మ ఇళ్లకు 12,571 కోట్లు ప్రకటించారు.

➡ కొత్తగా రాజీవ్ యువవికాసం, ఇందిరాగిరి జల వికాసం, సౌర విద్యుత్ గ్రామం, నగరాభివృద్ధి పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభించటానికి నిధులిచ్చింది.

➡ ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు గరిష్టంగా రూ. 4 లక్షల వరకూ సాయం చేసేందుకు రాజీవ్ యువవికాసం పథకానికి రూ. 6 వేల కోట్లు కేటాయించింది.

➡ ఎంపిక చేసిన గ్రామంలోని మొత్తం ఇళ్లకు తాగునీటి బోర్లు, వీధి దీపాలు సహా అన్నిటికీ సౌర విద్యుత్‌ను అక్కడే ఉత్పత్తి చేసి వినియోగించేలా 'సౌర గ్రామం' పథకాన్ని అమలు చేయటానికి రూ. 1500 కోట్లు కేటాయించింది. ఇది కూడా కొత్త పథకం.

➡ మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్తగా 'నగరాభివృద్ధి' పథకాన్ని ప్రారంభించటానికి రూ. 1000 కోట్లను



(రూ. కోట్లలో)

| | | |
|---|---|---|
| మొత్తం బడ్జెట్ | - | 3,04,965 |
| రెవెన్యూ వ్యయం | - | 2,26,982 |
| మూలధన వ్యయం | - | 36,504 |
| ద్రవ్యలోటు | - | 54,009 |
| రెవెన్యూ మిగులు | - | 2,738 |

బడ్జెట్‌లో కేటాయించింది.

➡ సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాథమ్యాలు నిర్ణయించి రూ. 23,373 కోట్లు కేటాయించింది.

**నిధుల సమీకరణ**

గతేడాది బడ్జెట్ రూ. 2,91,059 కోట్లుగా ప్రకటించినా, చివరికి ఆదాయం తగ్గటంతో తాజాగా సవరించిన బడ్జెట్‌ను రూ. 2,66,708.69 కోట్లుగా ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే ఏడాది ... మరో రూ. 37,757.86 కోట్ల ఆదాయం పెరుగుతుందనే అంచనాతో మొత్తం బడ్జెట్‌ను రూ. 3,04,466.55 కోట్లుగా చూపింది. ఇందులో పన్నుల ద్వారా రూ. 1,45,419.58 కోట్లు, పన్నేతర ఆదాయం కింద రూ. 31,618.77 కోట్లు కేంద్ర గ్రాంట్లుగా రూ. 22,782.50 కోట్లు, యూనియన్ పన్నుల్లో రాష్ట్రం వాటా కింద రూ. 29,899.77 కోట్లు వస్తాయని ప్రభుత్వం తెలిపింది. ఇవన్నీ నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరే ఆదాయ పద్దతులు. ఇవి కాకుండా ... కొత్తగా సేకరించే రుణాలు రూ. 69,639 కోట్లను కూడా ఆదాయంలో కలిపి మొత్తం రూ. 3.04 లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను చూపింది.

ఇందులో కేంద్ర గ్రాంట్లపై రాష్ట్ర ప్రభుత్వం ధీమాగా ఉంది. గతం లో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు రాష్ట్ర వాటా 40% ఇవ్వనందున నిధులు సరిగా రాలేదని, ఈ ఏడాది నుంచి

ఈ సమస్యను పరిష్కరించినందున వచ్చే ఏడాది రూ.22,782.50 కోట్లు గ్రాంట్లు వస్తాయని అంచనా వేస్తోంది.

**పన్నుల ద్వారా రాబడి పెంపు**

పన్నుల వసూళ్ల ద్వారా ప్రస్తుత ఏడాదిలో రూ.1,29,406.75 కోట్లు రాగా, వచ్చే ఏడాది రూ.1,45,419.58 కోట్లు వస్తాయని ప్రభుత్వం లెక్కేసుకుంది. పన్నుల వసూళ్లలో లోపాలను సవరించటం ద్వారా ఆదాయం గణనీయంగా పెంచాలని సంబంధిత శాఖలను ఆదేశించింది. ఇసుక విక్రయాల విధానంలో లోపాలను సవరించటంతో నెల క్రితంతో పోలిస్తే ఇప్పుడు రోజుకు రూ.కోటిన్నర ఆదాయం పెరిగినట్లు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఎక్సయిజ్ సుంకం గతేడాది అనుకున్నదాని కంటే పెరగటం వల్ల వచ్చే ఏడాది రూ.27,623.36 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో పేర్కొంది. పెట్రోలు, మద్యం అమ్మకాలపై వసూలు చేసే వ్యాట్ కూడా గణనీయంగా పెరుగుతుందని భావిస్తోంది. ఈరకంగా, శాఖలన్నింటిలో పన్నుల వసూళ్లలో లోపాలను సవరించటంతో పాటు, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలతో మరో రూ.16,012.83 కోట్లు పన్నుల వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం నమ్ముతోంది.

**రాబడి పెరుగుదల అంచనా 4.65 శాతమే**

ప్రస్తుత ఏడాదిలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధిరేటు 10.1% నమోదైనా...వచ్చే ఏడాది బడ్జెట్‌లో ఆదాయం పెరుగుదల 4.65% వరకు ఉంటుందని అంచనా వేసింది. వాస్తవిక దృక్పథంతోనే బడ్జెట్ ఆదాయ, వ్యయ అంచనాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించినందునే ఈ మేరకు పరిమితమైనట్లు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. గతంలో 10% నుంచి 15% అధికంగా అభివృద్ధిని చూపటం ఆనవాయితీగా వస్తోంది. అయితే జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వాస్తవిక దృక్పథంతో ఆదాయం పెంపును సవరించినట్లు సమాచారం.

**భూముల అమ్మకాలు, మద్యం దుకాణాల వేలం**

బడ్జెట్‌లో చూపిన మరో కీలక పద్దు పన్నేతర ఆదాయం కింద చూపిన రూ.31,618.77 కోట్లు. ప్రధానంగా భూముల అమ్మకాలపై రూ.20వేల కోట్లకు పైగా రావొచ్చని అంచనా వేస్తోంది. మద్యం దుకాణాలను ప్రతి రెండేళ్లకోసారి వేలం వేస్తారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీని ద్వారా 3 నుంచి 4 వేల కోట్ల వరకు రావొచ్చని అంచనా. ఇక స్థలాలు, భవనాల క్రమబద్ధీకరణ ద్వారా మరికొంత కలిపితే... పన్నేతర ఆదాయం మొత్తం రూ.31,618,77 కోట్లు అవుతుందని లెక్కేశారు.

**హైదరాబాద్ నగరంలో మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యత**

రాష్ట్ర రాజధానిలో మౌలిక సౌకర్యాల మెరుగుదలకు బడ్జెట్‌లో మొత్తంగా రూ.3,113.36 కోట్లు కేటాయించారు. పై వంతెనలు, అండర్‌పాస్‌లతో పాటు ట్రాఫిక్ సిగ్నళ్లు లేని రహదారుల కోసం ఉద్దేశించిన హెచ్-సిటీ పనులకు ఇందులో ఎక్కువ భాగం కేటాయించారు. అయితే వరద నాలాల అభివృద్ధి పనులకు, రోడ్డు నిర్వహణ, నిర్మాణ పనులకు, లింకు రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించలేదు.



**2024-25 ఆర్థిక సంవత్సరంలో... తెలంగాణ జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల ప్రకారం రూ.16,12,579 కోట్లు. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.1%. అదే సమయంలో దేశ జీడీపీ రూ.3,31,03,215 కోట్లు కాగా... వృద్ధి రేటు 9.9%. ఇక ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751. ఇందులో వృద్ధిరేటు 9.6%. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579 కాగా వృద్ధిరేటు 8.8%గా నమోదైంది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 1.8 రెట్లు, అంటే రూ.1,74,172 ఎక్కువ. రాష్ట్రంలో 2024-25లో సేవారంగం 66.3%, పారిశ్రామిక రంగం 16.4%, వ్యవసాయ, అనుబంధ రంగాలు 17.3% వాటాను కలిగి ఉన్నాయి. రానున్న పదేళ్ల కాలంలో తెలంగాణను 200 బిలియన్ డాలర్ల నుంచి అయిదు రెట్లు అభివృద్ధి చేసి ... ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందే దిశగా కార్యాచరణ సాగుతోంది. తెలంగాణలో శ్రామికశక్తి 68.7% ఉండగా, ఇందులో దేశీయ సగటు 64.3% మాత్రమే. రాష్ట్రంలో మహిళల ఉపాధి భాగస్వామ్యం 52.7% ఉండగా, దేశ సగటు 45.2%. హైదరాబాద్‌ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్ట్ (రూ.1500 కోట్ల కేటాయింపు) చేపట్టాం. రైజింగ్ తెలంగాణ - 2025 లక్ష్యంగా ప్రణాళికను పర్యావరణహితంగా అమలు చేస్తున్నాం. వ్యవసాయం అనుబంధ రంగాలు జీఎస్‌డీపీలో తక్కువ వాటా కలిగి ఉన్నప్పటికీ ... శ్రామిక రంగంలో మొత్తంగా 42.7% మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. పారిశ్రామిక రంగం 22.5%, సేవారంగం 34.8% మందికి ఉపాధి చూపుతున్నాయి.**

**- బడ్జెట్ ప్రసంగంలో భట్టి విక్రమార్క**

## తలసరి అప్పు రూ.2.12 లక్షలు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.54 కోట్లుగా తేలింది. ఈ లెక్కన తలసరి రుణభారం రూ.2,12,623గా అంచనా. ఈ ఏడాది రాష్ట్ర జీఎస్‌డీపీలో 28% వరకూ రుణభారం ఉన్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ఆఖరుకల్లా మొత్తం రుణభారం రూ.8.06 లక్షల కోట్లకు చేరుకుంది. గతంలో తీసుకున్న రుణాల్లో రూ.1,17,109 కోట్లను సంబంధిత కార్పొరేషన్లు చెల్లించలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రభుత్వమే కట్టాల్సి వస్తోంది. వడ్డీల కిస్తీల కింద ఈ ఏడాది రూ.17,729.77 కోట్లు చెల్లించగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.19,369 కోట్లు కట్టాల్సి ఉంటుందని, గతంలో తీసుకున్న రుణాలపై వడ్డీ, అసలు కలిపి నెలనెలా చెల్లించాల్సిన సొమ్ము రూ.6వేల కోట్లు దాటిందని బడ్జెట్‌లో ప్రభుత్వం తెలిపింది.

## బడ్జెట్‌లో ఆయా శాఖలకు కేటాయింపులు

(రూ.కోట్లలో)

| శాఖ | నిర్వహణ పద్దు | ప్రగతి పద్దు | మొత్తం |
|---|---|---|---|
| వ్యవసాయం | 1297 | 23142 | 24439 |
| పశు సంవర్ధకం | 1157 | 517 | 1674 |
| బీసీ సంక్షేమం | 1008 | 10397 | 11405 |
| ఇంధనం | 1630 | 19590 | 21221 |
| ఆర్థికం | 53771 | 237 | 54008 |
| పౌర సరఫరాలు | 119 | 5615 | 5734 |
| సాధారణ పరిపాలన | 481 | 631 | 1112 |
| వైద్య ఆరోగ్యం | 5667 | 6726 | 12393 |
| ఉన్నత విద్య | 3009 | 635 | 3643 |
| హోంశాఖ | 9337 | 851 | 10188 |
| గృహ నిర్మాణం | 1583 | 12571 | 14154 |
| పరిశ్రమలు | 115 | 3783 | 3898 |
| ఐటీ | 3 | 771 | 774 |
| నీటిపారుదల | 11544 | 11829 | 23354 |
| కార్మికశాఖ | 479 | 421 | 900 |
| న్యాయశాఖ | 1564 | 889 | 2453 |
| లెజిస్లేచర్ సెక్రటేరియట్ | 224 | 31 | 255 |
| మైనారిటీ | 745 | 2846 | 3591 |
| పురపాలకశాఖ | 7640 | 10037 | 17677 |
| పంచాయితీరాజ్ | 5260 | 26345 | 31605 |
| ప్రణాళిక | 122 | 3741 | 3863 |
| రెవెన్యూ | 2083 | 286 | 2369 |
| ఎస్.సి. సంక్షేమం | 341 | 11220 | 11561 |
| సెకండరీ విద్య | 16298 | 3166 | 19464 |
| రవాణా | 114 | 4371 | 4485 |
| రోడ్లు, భవనాలు | 1921 | 3986 | 5907 |
| గిరిజన సంక్షేమం | 662 | 6860 | 7522 |
| మహిళా శిశు సంక్షేమం | 973 | 1888 | 2862 |
| యువజన సంక్షేమం | 174 | 1237 | 1411 |
| అటవీ పర్యావరణం | 834 | 189 | 1023 |
| మొత్తం | 1,30,154 | 1,74,811 | 3,04,965 |

# అప్పులు కట్టటానికే మళ్ళీ అప్పులు

## తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక - 2025

**రాష్ట్ర ఆవిర్భావం నుంచి భారీగా పెరుగుతూ వస్తున్న రుణాలు (బడ్జెట్, బడ్జేటేతర) ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి రూ.7,38,707 కోట్లకు చేరాయని తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక - 2025 పేర్కొంది. బడ్జెట్‌కి ముందు నివేదికను సభలో ప్రవేశపెట్టారు. పెరుగుతున్న రుణభారం రాష్ట్ర ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపటమే కాకుండా వాటిని చెల్లించటానికే మళ్లీ అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని, ఇదో విషవలయంగా మారిందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. రోజువారీ తప్పనిసరి ఖర్చులకు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకునే రోజులు కూడా గణనీయంగా పెరిగాయని ... 2017-18లో అయిదు రోజులు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుంటే, 2023-24లో అది 121 రోజులకు చేరిందని తెలిపింది.**

**ముఖ్యాంశాలు**

'కాగ్' 2022-23 ఆర్థిక సంవత్సర అధ్యయనం ప్రకారం రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపుల వాటా చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం తెలంగాణ సాదర ఖర్చులో వడ్డీ చెల్లింపుల వాటా 14.2 శాతం. ఇది జాతీయ సరాసరి 12.7 శాతం కంటే ఎక్కువ. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్, గుజరాత్ రాష్ట్రాల కంటే ఎక్కువ కాగా... తమిళనాడు కంటే కాస్త తక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల కోసం తిరిగి చెల్లించే మొత్తం 2014-15లో రూ.6,954 కోట్లు ఉండగా, 2023-24 నాటికి రూ.36,686 కోట్లకు పెరిగిందని, బడ్జెటేతర రుణాలను పరిగణలోకి తీసుకుంటే, 2014-15లో రూ.7,254 కోట్లు ఉండగా, 2023-24 నాటికి రూ.61,691 కోట్లకు చేరినట్లు తెలిపింది. దీనికి కారణం స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసి ప్రభుత్వ గ్యారంటీలతో రుణాలు తీసుకోవటమని పేర్కొంది.

రాష్ట్ర ఆర్థిక రంగ ఆరోగ్య పరిస్థితికి సొంత ఆదాయంలో వడ్డీ చెల్లింపులు ఎంత అన్నది కీలకమని ... ఈ రేషియో 2014-15లో 14.6 శాతం ఉండగా, 2023-24 నాటికి 18 శాతానికి పెరిగిందని, బడ్జెటేతర రుణాలనూ పరిగణలోకి తీసుకుంటే, వడ్డీల భారం 15.1 శాతం నుంచి 28.2 శాతానికి పెరిగిందని వెల్లడించింది. వడ్డీలకే ఎక్కువగా చెల్లించటం వల్ల అత్యవసర సర్వీసులు, అభివృద్ధిపై ప్రభావం పడుతోందని తెలిపింది.



**2025 ఫిబ్రవరి వరకు ఉన్న రుణాలు**
**(రూ. కోట్లలో)**

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా చెల్లించాల్సిన రుణాలు : 4,37,223
- ప్రభుత్వం ఎస్‌పీవీలు / పీఎస్‌యూలకు గ్యారంటీ ఇచ్చి, మళ్లీ ప్రభుత్వమే చెల్లించేలా తీసుకున్న రుణాలు: 1,17,109
- ప్రభుత్వ గ్యారంటీతో రుణాలు తీసుకొని తిరిగి ప్రభుత్వరంగ సంస్థకే చెల్లించేవి : 1,24,419
- ప్రభుత్వ గ్యారంటీలు లేకుండా ఎస్‌పీవీలు/ కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు : 59,956


(2025-26కి రాష్ట్ర ప్రభుత్వం రుణభారం అంచనా రూ. 5,04,814)

**సొంత పన్నుల రాబడిలో అగ్రస్థానం**

సొంత పన్నుల ఆదాయం వాటాలో దేశంలో అన్ని

**కాళేశ్వరంపై రూ.93 వేల కోట్ల ఖర్చు**

2014 నుంచి తెలంగాణ సాగునీటి రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేయగా ... 15.81 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి వసతి లభించిందని సామాజిక, ఆర్థిక నివేదిక వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద రూ.93,872 కోట్లు ఖర్చు చేసి 98,590 ఎకరాలకు మాత్రమే సాగునీటి వసతి కల్పించినట్లు పేర్కొంది. పాలమూరు - రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల కింద రూ.39,288 కోట్లు ఖర్చు చేసినా ఇప్పటివరకు ఏమీ సాగులోకి రాలేదంది.
కాళేశ్వరం కింద ఎకరం ఆయకట్టుకు నీరందించే ఖర్చు చాలా ఎక్కువగా ఉందని 'కాగ్' పేర్కొందని... ఈ ప్రాజెక్టు తుది నిర్ణయం రూ.81,911 కోట్ల నుంచి రూ.1,47,427.41 కోట్లకు చేరిందని వివరించింది. అధిక మొత్తంలో ఎక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవటంతో ప్రస్తుతం ప్రభుత్వం ఏడాదికి రూ.18 వేల కోట్ల భారం భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో, తక్కువ ఖర్చులో పూర్తయ్యే ప్రాజెక్టులపై సర్కారు దృష్టి సారించిందని నివేదిక వివరించింది.



రాష్ట్రాల కంటే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సామాజిక, ఆర్థిక నివేదిక తెలిపింది. 'గోవా మినహా 27 రాష్ట్రాల అంచనాలను 2024 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు పరిశీలిస్తే ... యూనియన్ ప్రభుత్వానికి సంబంధించిన స్థూల పన్నుల ఆదాయం, రాష్ట్రాలకు సంబంధించిన సొంత పన్నుల రాబడి గణనీయంగా పెరిగింది. ఇందులో 15 ప్రధాన రాష్ట్రాలను పరిశీలిస్తే మొత్తం ఆదాయంలో సగానికి పైగా సొంత పన్నుల నుంచే వస్తోంది. వీటిల్లో 88 శాతంతో తెలంగాణ ముందుండగా, 86 శాతంతో కర్ణాటక, హర్యానా రెండో

**నిముషానికి ఒక కోటి అప్పు**

తెలంగాణ ప్రభుత్వం 15 నెలల్లో రూ.1.63 లక్షల కోట్లు అప్పు చేసిందని, నిముషానికి కోటి రూపాయల రుణం తెస్తోందని, పెట్టుబడుల కోసం బడ్జెట్‌లో 11.50 శాతం మాత్రమే కేటాయిందని, ఇక సంక్షేమం-అభివృద్ధి సమతుల్యం ఏమున్నట్లని ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రశ్నించారు.




స్థానంలో ఉన్నాయి.

⏭ తయారీ రంగంలో టీజీ - ఐపాస్ ద్వారా 2024-25లో అనుమతులు పొందిన కొత్త యూనిట్లు, ఉపాధి లభించిన జిల్లాల్లో మేడ్చల్ - మల్కాజ్‌గిరి తొలిస్థానంలో ఉండగా, ములుగు చివరి స్థానంలో ఉంది. రెండు, మూడు స్థానాల్లో సంగారెడ్డి, రంగారెడ్డి ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద 2024-25లో కొత్తగా 1476 యూనిట్లు వచ్చాయని, రూ.9,850.23 కోట్ల పెట్టుబడితో 38,598 మందికి ఉపాధి లభించిందని నివేదిక పేర్కొంది.

⏭ టీజీ ఐఐసీ ద్వారా 2023 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు పరిశ్రమల విభాగంలో 536 కంపెనీలకు భూమి కేటాయించగా, రూ.10,991 కోట్ల పెట్టుబడి వచ్చి 37,143 మందికి ఉపాధి లభించింది.

✶

# ఏపీ అభివృద్ధికి ఆశావహ వాతావరణం

## - రాష్ట్ర ఆర్థిక సర్వే 2025 -

**ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12.94% వృద్ధి సాధించబోతున్నట్లు రాష్ట్ర ఆర్థిక సర్వే పేర్కొంది. వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక, సేవా తదితర రంగాల్లో పెరుగుదల వల్లే ఈ పురోగతి సాధ్యమవుతుందని విశ్లేషించింది. 'మంచి వర్షాలు పడటం వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి గతేడాది కన్నా అధికంగా ఉంది. రానున్న అయిదేళ్లలో సాగురంగాలలో వచ్చే మార్పులతో ఈ వృద్ధిని మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తయారీ, బ్యాంకింగ్, బీమా రంగాల్లోనూ పురోగతి కనిపిస్తోంది. వెరసి రాష్ట్రంలో రూ.16.06 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి సాధ్యమవుతుంది' అని ఆర్థిక సర్వే విశ్లేషించింది. 2024-25 ఆర్థిక సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభకు సమర్పించింది. స్వర్ణాంధ్ర విజన్ సూచీల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆర్థిక, మానవ వనరులను సద్వినియోగపరుస్తూ, మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మలచనున్నట్లు పేర్కొంది.**

**ఆదాయం... అప్పులు... లోటు**

➔ రాష్ట్ర తలసరి ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,68,653 ఉంది. జాతీయ సగటు రూ.2,00,162 కన్నా ఇది ఎక్కువ.

➔ ఈ ఏడాదిలో సొంత పన్నుల ద్వారా రూ.94,967 కోట్లు, పన్నేతర రాబడుల నుంచి రూ.7,018 కోట్లు, యూనియన్ బదలాయింపుల ద్వారా రూ.89,157 కోట్ల ఆదాయం వచ్చింది.

➔ చేబదుళ్లు, ప్రజారుణం చెల్లింపులు పోను, 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,36,512 కోట్లు ఖర్చు చేయగా, 2024-25లో రూ.2,49,418 కోట్లు వెచ్చించనుంది.

➔ రాష్ట్ర అప్పు 2023-24 చివరి నాటికి రూ.4,91,734 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.5,64,488 కోట్లకు చేరనుంది.

➔ 2023-24లో రెవెన్యూ లోటు రూ.38,683 కోట్లు, ద్రవ్యలోటు రూ.62,720 కోట్లు కాగా, 2024-25 ఆఖరు నాటికి ఇవి వరుసగా రూ.48,311 కోట్లు, రూ.73,362 కోట్లు ఉండొచ్చని సర్వే అంచనా వేసింది.

**సాగు, ఉత్పత్తి ప్రోత్సాహకరం**

రాష్ట్రంలో జూన్ నుంచి డిసెంబర్ వరకు సగటు వర్షపాతం 860 మిల్లీమీటర్లు కాగా 2024లో ఈ కాలానికి 960.3 మి.మీ. కురిసింది. 11.7% అదనపు వర్షపాతం నమోదైంది. ఆహార పంటల సాగు పెరిగింది. 2023-24లో 33.24 లక్షల హెక్టార్లలో పంటలు వేయగా, ఈ ఏడాది 37.51 లక్షల హెక్టార్లలో సాగైంది. 12.85% వృద్ధి నమోదైంది. గతేడాది 143.31 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి రాగా, ఈ ఏడాది 161.86 లక్షల టన్నులుగా అంచనా వేస్తున్నారు. వరి ధాన్యం ఉత్పత్తి 127.15 లక్షల టన్నులు రావొచ్చని అంచనా. కిందటి ఏడాదితో పోలిస్తే ఇది 12.95% అధికం. మంచి వర్షాలు, చక్కని నీటిపారుదల సౌకర్యాలు, పంటమార్పిడి విధానాల వల్ల ఆహారధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల సాధ్యమవుతుందని ఆర్థిక సర్వే విశ్లేషించింది. 18.23 లక్షల హెక్టార్లలో సాగవుతున్న పండ్ల తోటలతో దేశంలోనే పండ్ల ఉత్పత్తిలో ఏపీ అగ్రస్థానంలో ఉంది.



➔ వచ్చే అయిదేళ్లలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అత్యధిక వృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వడ్డీలేని రుణాలు, మౌలిక సౌకర్యాల మెరుగుదల, రాయితీపై విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాల పంపిణీ, పెట్టుబడి లేని ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తూ ఈ లక్ష్యాన్ని చేరుకోవాలన్నది ప్రణాళిక.

➔ వ్యవసాయ రంగం రూ.5.19 లక్షల కోట్ల అదనపు స్థూల విలువను ఏపీ ఆర్థికానికి జోడిస్తోంది. సాగులో 15.86%, మత్స్య రంగంలో 16% వృద్ధిరేటు ఉంది.

➔ పారిశ్రామిక రంగం రూ.3.41 లక్షల కోట్ల స్థూల అదనపు విలువ జోడిస్తూ 6.71% వృద్ధి కనబరుస్తోంది. తయారీ రంగంలో 6.57%, నిర్మాణ రంగంలో 10.47% వృద్ధి ఉంది.

➔ సేవల రంగం 11.70% వృద్ధితో రూ.6.11 లక్షల కోట్ల స్థూల అదనపు విలువను జోడించనుంది. కమ్యూనికేషన్ 15.28%, బ్యాంకింగ్, బీమా రంగాలు 14.6% వృద్ధి కనబరుస్తున్నాయి.



➔ కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. 2025 జనవరి నాటికి 9,13,283 మంది కౌలు రైతులకు ఈ-కార్డులు అందించగా, వారిలో 2 లక్షల మందికి రూ. 2,848 కోట్ల రుణాలు ఇప్పించింది.



➔ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల్ని అందరికీ అందుబాటు ధరల్లో ఉండేలా చర్యలు తీసుకుంటోంది. 2024-25లో ఉల్లిపాయల ధరలు 40.24% పెరగ్గా, ప్రభుత్వం కల్పించుకొని నేరుగా రైతుల నుంచి సేకరించింది. గిడ్డంగుల్లో నిల్వచేసి, ప్రజలకు సరసమైన ధరలకు అందేలా చేసింది.

➔వ్యవసాయ కూలీలు, పరిశ్రమల కార్మికులకు సంబంధించి వినియోదారుల ధరల సూచీలో వృద్ధి నమోదైంది. పరిశ్రమల కార్మికుల సూచీ 4.89% పెరగ్గా, వ్యవసాయ కూలీలకు సంబంధించి 5.93% వృద్ధి చెందింది. వ్యవసాయ కార్మికుల (పురుషులు) రోజువారీ సగటు వేతనం రూ.561తో 5.65% వృద్ధి కనబరిచింది. మహిళా కూలీల సగటు వేతనం రూ.398తో 2.58% వృద్ధి ఉంది.

➔వడ్రంగులు, స్వర్ణకారుల వేతనాల్లో వేగవంతమైన పురోగతి ఉంది. కార్పెంటర్ల రోజువారీ సగటు వేతనం 7.74% వృద్ధితో రూ.710 గా నమోదైంది. చర్మకారుల వేతనాల్లో స్వల్ప తగ్గుదల ఉంది.

➔ ప్రభుత్వం ఆహార భద్రత కింద 1.48 కోట్ల మందికి రాయితీపై బియ్యం, తదితరాలు అందిస్తోంది. దీపం-2 పథకం కింద ఎల్‌పీజీ సిలిండర్లు ఇస్తోంది. ✷

## పెట్రోలు బంకుల్లో అక్రమాల పట్ల అప్రమత్తమవ్వండి

పెట్రోలు బంకుల్లో యజమానులు కొందరు దోచుకుంటున్న తీరును సోషల్ మీడియా, పత్రికల్లో చూసిన వినియోగదారులు విస్తుపోతున్నారని, అనంతపురం వంటి చోట్ల జరిగిన మోసాలు జరగకుండా విజయనగరంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు, లోక్ సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా తూనికలు, కొలతల శాఖ సహాయ నియంత్రకుడు పీవీ రంగారెడ్డిని పౌర వేదిక బృందంతో కలిసి వినతిపత్రం అందచేశారు. లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించాక 1998లో స్వరాజ్యం పేరుతో పౌర సేవల పత్రాన్ని ప్రకటించి తొలి ఉద్యమాన్ని పెట్రోలు బంకుల్లో తూనికల మోసాల మీదే చేశామని, ఆనాడు జేపీ నాయకత్వంలో అతి తక్కువ వ్యయంతో, రాజ్యాంగబద్ధంగా తాము చేసిన ఉద్యమంతో దేశంలోని అన్ని పెట్రోలు బంకుల్లో మీటర్లను సరిచేశారని, దీనివల్ల ఇప్పటి వరకు దేశ ప్రజలకు రూ. 10 లక్షల కోట్ల వరకు ఆదా అయినట్లు అంచనా అన్నారు. టెక్నాలజీ పెరుగుతున్నా ఇటీవల కొన్నిచోట్ల మళ్లీ మోసాల ఆరోపణలు వస్తున్నాయని, తూనికలు కొలతల శాఖ అప్రమత్తమవ్వాలన్నారు. మనలో చాలామందిమి వాహనాల్ని వినియోగిస్తున్నామని, యువత కాస్త సామాజిక అవగాహనతో వ్యవహరిస్తే తేలిగ్గా ఈ అక్రమాలను అరికట్టవచ్చన్నారు. స్థానికంగా చిన్న ప్రయత్నంతో పెద్ద ఫలితాల్ని సాధించవచ్చన్నారు.పెట్రోలు బంకుల్లో వినియోగదారుల పట్ల గౌరవంగా ప్రవర్తించటం, పరిశుభ్రత, మంచినీరు, అగ్నిప్రమాదాల నివారణ వంటి కనీస వసతుల్ని కల్పించటం, కల్తీలు, మోసాలు లేకుండా ఇంధన సరఫరాకు అధికారులు, ప్రజలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామరాజు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం పది కాలాలు ఉండాలంటే...

ప్రజాస్వామ్యం అనేది విపత్కర పరిస్థితుల్లో చిక్కుకోకుండా విజయవంతంగా పనిచేయాలంటే కొన్ని విలువలను పాటించాలి. ఈ అంశం గురించి చర్చించే ముందు కొన్ని ప్రాథమిక సూత్రాలను గమనంలోకి తీసుకోవడం అవసరం. మొదటిది; ప్రజాస్వామ్యం ఎప్పుడూ ఒకే తీరులో ఉండదు. ప్రజాస్వామ్య భావన ఎప్పటికప్పుడు స్థాయిలో మార్పు చెందుతూ వస్తుంటుంది. ఉదాహరణకు గ్రీకుల అథీనియన్ ప్రజాస్వామ్యం వేరు. మన ఇప్పటి ప్రజాస్వామ్యం వేరు. నాటి గ్రీకు సమాజంలో సగం మందే



పౌరులు. మిగిలిన సగం బానిసలే. బానిసలకు ఎటువంటి రాజకీయ హక్కులు ఉండవు. మన ప్రజాస్వామ్యం ఇందుకు పూర్తిగా భిన్నమయింది. రెండవ అంశం: ప్రజాస్వామ్యం ఒకే దేశంలో కూడా ఒకే రకంగా ఉండదు. ఇంగ్లండ్ చరిత్రనే తీసుకుంటే 1688 విప్లవం ముందు ప్రజాస్వామ్యం వేరు, తదనంతరం వేరు. మళ్లీ 1832 చట్టం తరువాత ప్రజాస్వామ్యం లక్షణంలోనే కాదు లక్ష్యంలో కూడా మార్పు వస్తుందని మనం గమనించాల్సిన మూడవ విషయం. పురాతన ఇంగ్లీషు ప్రజాస్వామ్యాన్ని గమనిస్తే లక్షణం, లక్ష్యాలలో మార్పు తెలుస్తుంది. రాజు నిరంకుశ అధికారాన్ని అడ్డుకోవడానికి ప్రజాస్వామ్య చర్యలు అవసరమయ్యాయి.

మరి ఈ రోజు ప్రజాస్వామ్యం లక్ష్యం ఏమిటి? ప్రజా సంక్షేమమే ఈనాటి ప్రజాస్వామ్య ప్రధాన కర్తవ్యం. ఇది ప్రజాస్వామ్య భావనలో వచ్చిన బలీయమైన మార్పు. ప్రజాస్వామ్య భావనలో వచ్చిన మార్పులు సరే. ఇంతకీ ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? రాజనీతి కోవిదులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు..అనేక మంది అనేక రకాలుగా ప్రజాస్వామ్యాన్ని నిర్వచించారు. మనం రెండు ప్రఖ్యాత నిర్వచనాలను తీసుకుందాం..వాల్టర్ బెగాట్ “ఆధునిక ప్రజాస్వామ్యాన్ని చర్చల ద్వారా ప్రభుత్వం” అని నిర్వచించారు. ఇక అబ్రహం లింకన్ ఇచ్చిన నిర్వచనం చాలా మందికి తెలిసిందే. “ప్రజల కోసం ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వమే ప్రజాస్వామ్యం” నా దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే “రక్తపాతరహితంగా ప్రజల ఆర్థిక, సామాజిక జీవితాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చే ప్రభుత్వ వ్యవస్థ”. ప్రభుత్వం వివిధ రంగాలలో ప్రవేశపెట్టే మార్పును ప్రజలు శాంతియుతంగా ఆమోదిస్తే ప్రజాస్వామ్యం ఉన్నట్టే. ప్రజామోదమే ప్రజాస్వామ్యానికి గీటురాయి. ఈ ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయాలంటే ఎటువంటి పరిస్థితులు ఉండాలి ఇదే ఇప్పుడు మన ముందున్న విషయం. ఫలానా సూత్రాలను అనుసరిస్తే ప్రజాస్వామ్యం విజయవంతంగా నడుస్తుందని ఇంతవరకు శాస్త్రకారుడు రాయలేదు. మనకు మనంగా చరిత్రను అధ్యయనం చేసి ప్రజాస్వామ్య సాఫల్య, వైఫల్య పరిస్థితులను అర్థం చేసుకుని స్థూల నిర్ణయాలు చేసుకోవాలి.

ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఉండాల్సిన మొదటి షరతు..సమాజంలో ఎటువంటి అసమానతలు లేకపోవటం. అణిచివేతకు గురయ్యే వర్గం ఉండకూడదు. పల్లకీని ఎక్కేవాళ్లు పల్లకీని మోసేవాళ్లు ఉన్న సమాజంలో ప్రజాస్వామ్యం వికసించదు. ఇంత హెచ్చు తగ్గులు ఉన్న సమాజంలో రక్తపాత విప్లవానికి ఎప్పుడూ అవకాశాలు ఉంటాయి. మనం ముక్కచెక్కలుగా ఉంటే ప్రజాస్వామ్య సౌదం కూలిపోతుందని లింకన్ మహాశయుడు హెచ్చరించాడు. వర్గ, కుల విభేదాలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తాయి. అణచివేసే, అణచివేతకు గురయ్యే వారి మధ్య అగాధం పెరిగిన కొద్ది ప్రజాస్వామ్యం కుప్పకూలు తుంది. సామాజిక అసమానతల వల్ల ప్రజాస్వామ్యం విఫలమయిన ఉదాహరణలు చరిత్రలో కోకొల్లలు.

ప్రజాస్వామ్యం క్రమబద్ధంగా పనిచేయడానికి అవసరమైన రెండో కారకం ప్రతిపక్షాల ఉనికి..ప్రజాస్వామ్యంలో పార్టీ పద్ధతి గురించి పెద్ద చర్చే జరుగుతుంది. మాట వరుసకు అడుగుతున్నాను..అసలు ప్రజాస్వామ్యం పనితీరు ఏమిటి? ఒక రకమైన వీటో అధికారం. నియంతృత్వ, ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకునే అధికారాన్ని కలిగి ఉండడమే ప్రజాస్వామ్యం. అయిదేళ్లకోసారి తమ దగ్గరికొచ్చే ప్రతినిధులను తొలగించాలా? తిరిగి ఎన్నుకోవాలా? అన్నది నిర్ణయించుకునే అధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. అంటే ప్రజల చేతుల్లో వీటో అధికారం ఉంటుందన్న మాట. అయితే వీటో హక్కును వినియోగించటానికి అయిదేళ్లూ ఆగాల్సిన అవసరం లేకుండానే తక్షణ వీటో వినియోగానికి అవకాశం ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు సవాలు చేయటానికి, అవసరమైతే తిప్పికొట్టడానికి ప్రతిపక్షం ఉంటేనే ఇది సాధ్యపడుతుంది. తన పార్టీకి చెందని సభ్యులకు జవాబుదారీగా ఉండాల్సి రావటంతో ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనికి సంబంధించి భారతదేశంలో పరిస్థితులు అపసవ్యదిశలో ఉన్నాయి. వ్యాపార ప్రకటనల కోసం మన పత్రికలు ప్రభుత్వ కార్యక్రమాలకు ఎక్కువ ప్రచారం ఇస్తున్నాయి. ప్రతిపక్షాల నుంచి ఎక్కువ రాబడి రాదు కదా. అధికార పార్టీ సభ్యుల ఉపన్యాసాలను మొదటి పేజీలలోనూ, ప్రతిపక్షాల వారి ప్రకటనలను మూలల్లోనూ ప్రచురిస్తుంటారు. ఇది ప్రజాస్వామ్యం మీద విమర్శ కాదు. ప్రజాస్వామ్యానికి పట్టిన దుస్థితి ఇదే. ఇంగ్లాండు, కెనడాలలో పరిస్థితి చాలా వరకూ మెరుగ్గా ఉంటుంది. ప్రతిపక్షాల విలువను అక్కడ బాగా గుర్తిస్తారు. దీనివల్ల ప్రజాస్వామ్యం సాఫీగా పనిచేస్తుంది.

ప్రజాస్వామ్యం సజావుగా పనిచేయాలంటే అనివార్యంగా ఉండాల్సిన మూడవ అంశం.. చట్ట సమానత్వం. ప్రభుత్వ వ్యవహారాలలో చట్ట సంబంధ వ్యవహారాలలో ఎవరికి మినహాయింపు ఉండకూడదు. చట్టం ముందు సమానత్వం కేసులు అక్కడక్కడ కనిపించవచ్చు కానీ, ప్రభుత్వ లావాదేవీలలో ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి తాండవం చేస్తున్నాయి. తన పార్టీ వాళ్లు తన సొంతవాళ్లు అనుకున్న వారికోసం నిబంధనలకు నీళ్లు వదిలిన సంఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. ఏ రంగు టోపీ పెట్టుకున్నాడో చూసి లైసెన్సులు గ్రాంట్ చేసే ప్రబుద్ధులు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉన్నారు. ఒకప్పుడు అమెరికాలో కూడా ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి ఉండేది. కానీ దీనివల్ల ప్రజాస్వామ్యం పతనమవుతుందని గ్రహించి ప్రభుత్వాలకి ఉద్యోగుల్ని ముడిపెట్టే విధానానికి స్వస్తి చెప్పారు. గ్రేట్ బ్రిటన్ ఈ విష యంలో ఆదర్శప్రాయంగా చెప్పుకోవచ్చు. స్వచ్ఛమైన పాలన ఉండాలంటే ప్రభుత్వము ఉద్యోగస్తుల విధి నిర్వహణలో జోక్యం చేసుకోకూడదని వారు కచ్చితంగా విశ్వసిస్తారు..పాటిస్తారు. బ్రిటిష్ ఇండియాలో కూడా ఇదే పద్ధతి అమలులో ఉండేది. ప్రభుత్వం పాలసీలను రూపొందించవచ్చు కానీ, పరిపాలనా విధానంలో జోక్యం చేసుకోకూడదన్నది ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలలో ఒకటి. ఈరోజు మన దేశం ఈ విషయంలో గాడి తప్పింది. దీనివల్ల అనేక కుంభకోణాలు చోటు చేసుకోవడమే కాక, ప్రజాస్వామ్యం మీద నమ్మకము సడలిపోతోంది.

రాజ్యాంగ నైతికతను గుర్తించడం ప్రజాస్వామ్య విజయానికి ఒక కీలకాంశం. మనదేశంలో రాజ్యాంగం గురించి మాట్లాడే వాళ్లకు కొదవలేదు. మౌలిక విలువలు పాటించకపోతే రాజ్యాంగం చిత్తుకాగితం పాటి విలువ చేయదన్న వాదనతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. లిఖిత రాజ్యాంగం లేని ఇంగ్లాండులో కేవలం ఈ విలువను పాటించడం వల్లే వ్యవస్థ నడుస్తోంది. మనకంటే ఎన్నో రెట్లు మెరుగైన పరిపాలనను వాళ్లు అందుకో గలిగారంటే నైతిక విలువలే కారణం. ఇక్కడ ఒక మంచి ఉదాహరణ చెబుతాను. వాషింగ్టన్ అమెరికన్ల ఆరాధ్య దైవం. అమెరికన్లు రాజ్యాంగం రాసుకున్న తర్వాత మొదటి అధ్యక్షుడు వాషింగ్టన్. తన పదవీకాలం పూర్తయిన తర్వాత తిరిగి అధ్యక్ష పదవికి నిలబడానికి ఆయన నిరాకరించారు. వాషింగ్టన్ కోరుకుంటే ఎన్నిసార్లు నిలబడితే అన్ని సార్లు అధ్యక్షుడు అవుతారు. కానీ ఆయన అలా చేయలేదు. వ్యక్తి ఆరాధన ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని చివరకు విలువలు పతనమవుతాయని హెచ్చరించారు. అందరి బలవంతం మీద రెండోసారి అధ్యక్షుడైనా, మూడోసారి మాత్రం అధ్యక్ష పదవిని వాషింగ్టన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అదీ నైతికత అంటే. అలాగే ఇంగ్లాండ్ విషయంలో నైతిక విలువల గురించి మనం అనేక ఉదాహరణలు చెప్పుకోవచ్చు. విలువలను కాపాడడం కోసం అధికారాన్ని తృణీకరించిన ఆంగ్లేయ నాయకులు అనేకమంది ఉన్నారు.

అలాగే మైనారిటీ మీద మెజారిటీ పెత్తనం చెలాయించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు. ఇంగ్లాండులో 1931 ఎన్నికలను ఇక్కడ ఉదాహరణగా ప్రస్తావించవచ్చు. 650 మంది సభ్యులు కల కామన్స్ సభలో 50 మంది

మాత్రమే లేబర్ పార్టీ సభ్యులు ఉన్నారు . ఎన్నో రెట్లు ఎక్కువ ఉన్నా కన్జర్వేటివ్ పార్టీ సభ్యుల ముందు వాళ్లు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలిగారు. ఫలానా సందర్భంగా మమ్మల్ని కన్జర్వేటివ్ పార్టీ మాట్లాడనీయలేదు అన్న ఆరోపణలు నేను ఎప్పుడూ లేబర్ పార్టీ నుంచి వినలేదు. (ఆ సమయంలో నేను ఇంగ్లాండులో ఉన్నాను) సంఖ్యాబలం లేని పార్టీ సభ్యుల ప్రతిపాదనల మీద స్వేచ్ఛగా చర్చించే అవకాశాన్ని కల్పించాలి. మైనారిటీల అభిప్రాయాలను పార్లమెంటులో అణగదొక్కితే వాళ్లు రాజ్యాంగేతర మార్గాలను అనుసరిస్తారు.

మనం మరవకూడని ఇంకో అంశం.. అన్యాయానికి స్పందించే లక్షణాన్ని కలిగి ఉండడం. నలుపైనా, తెలుపైనా, ఆడైనా, మగైనా, నిమ్నైనా, అగ్ర అయినా, అన్యాయం జరిగితే స్పందించి ముందుకు ఉరకటం అనేది ప్రజాస్వామ్య భావనను ఉద్దీపింప చేస్తుంది. దక్షిణాఫ్రికాలో నల్లవారికి జరిగే అన్యాయాలకు స్పందించి పోరాడే శ్వేత జాతీయులు ఉన్నారు. మన భారత దేశంలో దక్షిణాఫ్రికాగా పేర్కొనదగిన వేలాది పల్లెలు ఉన్నాయి. కానీ దళితుల కోసం ఆరాటపడి పోరాడే వారు ఇక్కడ దాదాపు లేరు. ఎందుకంటే అంతరంగిక చైతన్యం, స్పందన ఇక్కడ లేదు. ప్రజాస్వామ్యం గురించి ప్రాథమిక స్థాయిలో అవకాశం ఉన్నంత మేరకు చర్చించాం. మనకు స్వాతంత్ర్యం లభించింది అన్న భావంలో ఇప్పుడు మనం ఉన్నాం. చేయాల్సింది ఏమీ లేదు అన్న భావన ఆవరిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అనే పచ్చని చెట్టు ఎక్కడబడితే అక్కడ ఎదగదు. ఇంగ్లాండులో, అమెరికాలో అది పరిఢవిల్లింది. ఫ్రాన్స్‌లో ఒక మేరకు అభివృద్ధి చెందింది. ఎన్నో దేశాల్లో ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా ఖూనీ చేసి సైనిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఎన్నో సవాళ్లను అధిగమిస్తే తప్ప ప్రజాస్వామ్యం భారతదేశంలో విజయవంతం కాదు. ఇన్నాళ్లు మనదేశంలో ఏదైనా తప్పు జరిగితే బ్రిటిష్ వాళ్ళ మీద నెట్టేవాళ్ళు. ఇప్పుడు ఆ అవకాశం లేదు. అన్నిటికీ మనమే బాధ్యత వహించాలి.

**(అంబేద్కర్ రచనల నుంచి)**

✳

# ఏసీబీకి పట్టుబడితే పదోన్నతులు వద్దు

## సీఎం ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వినతి

అవినీతి నిరోధక శాక (ఏసీబీ)కి పట్టుబడి, తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి పోస్టింగులు, పదోన్నతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన తెలంగాణ సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ శాఖల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని, ప్రతి చిన్న పనికీ లంచాలు ఇవ్వాల్సివస్తోందని, ముఖ్యంగా రెవెన్యూ, పురపాలక, పోలీసు, వాణిజ్య పన్నులు, ఆబ్కారీ వంటి శాఖల్లో ఇది ఇంకాస్త ఎక్కువగా ఉందని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో తప్పు చేస్తే శిక్ష పడుతుందన్న భయం కూడా లేకుండా పోయిందని, ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ నివేదికలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవటమే ఇందుకు కారణమన్నారు. పైగా తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లతో పాటు పదోన్నతులు కూడా ఇస్తూనే ఉన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో కొందరు అధికారుల ఉదాహరణలను ప్రస్తావిస్తూ ... మిగతా శాఖల్లోనూ ఇలాంటి కేసులు ఉన్నాయని, వాటిపై విచారించి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

# బూత్‌లవారీ ఓటింగ్ వివరాలపై చర్చకు ఈసీ సంసిద్ధత

లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బూత్‌లవారీగా ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్యను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్న డిమాండ్‌పై చర్చించేందుకు ఎన్నికల సంఘం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈసీ వాదనను నమోదు చేసుకున్న సుప్రీంకోర్టు ఈ గణాంకాల కోసం 10 రోజుల్లోగా కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లను కోరింది. టీఎంసీ ఎంపీ మహువ మొయిత్రి, ఏడీఆర్ సంస్థ 2019లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు జడ్జీల ధర్మాసనం విచారణ జరిపింది.

# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి ఓ మహిళ బహిరంగ లేఖ

**నమస్కారం!**

మీరు ఇటీవలి ప్రసంగాలలో ప్రజలు వీలున్నంతమంది పిల్లల్ని కనాలని చెప్పటం ఒక మహిళగా వ్యతిరేకిస్తున్నాను. గతంలో, అవగాహనలేక పెరిగిన జనాభాని తగ్గించటానికి 25 ఏళ్లు పట్టింది. ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలకు ఇంకా ఎక్కువ సమయం పడుతోంది.

మా తాతల, అన్నదమ్ముల కుటుంబాల్లో పని - పాటూ లేదు. సాపాటు, సంతానాభివృద్ధి చేయటం తప్ప!ఒక్కొక్కరికి 5, 7, 9, 11 మంది పిల్లలు. ఆనాటి మహిళలు ఎన్నిపాట్లు పడ్డారో తెలియదు (భార్యాభర్తలకు వయసు తేడా ఎక్కువ. పొలం పనులు మగవారు చేస్తే, ఇంటి చాకిరీ ఆడవారిది. మా అమ్మగారు చెప్పగా విన్నాను). అయిదుగురు పిల్లలుంటే అది అపరిమిత కుటుంబం కింద లెక్క.ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో అది సజావుగా జరిగిపోయింది. కానీ వేగంగా పట్టణీకరణ, పోటీ ఆర్థిక వ్యవస్థల ప్రస్తుత కాలంలో అది కుదరదు. ఇవన్నీ మీకు తెలియనివి కావు. అధిక సంతానం.. మహిళకు వరం కాదు.. శాపం! ఇప్పుడిప్పుడే అభివృద్ధి అంటే ఏమిటో అర్థం చేసుకుని, ఆ పథంలోకి వస్తున్న మన దేశానికి తిరిగి సమస్యలను తెచ్చిపెట్టటం సరికాదు.

ఇప్పటి జనాభాలో వృద్ధుల జీవనకాలం పెరిగి 80 - 100 కి చేరుకుంది. మంచిదే! కానీ చాలామంది, దాదాపు 80 శాతం మంది దాకా అసంఘటిత రంగంలో, తక్కువ నైపుణ్యాలతో ఉన్నారు. వీరందరికీ, ప్రభుత్వోద్యోగుల లాగా పెన్షన్, ఆరోగ్య సంరక్షణ అక్కర్లేదా? 3% సర్కారీ ఉద్యోగుల కోసమే కాకుండా, ప్రజలందరికీ పెన్షన్ అందించేందుకు కాంట్రిబ్యూటరీ వ్యవస్థను కొంత గ్యారంటీతో ఏర్పాటు చేసేందుకు, మిగిలినవారికీ విస్తరించేందుకు యూనియన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో ప్రతి నెలా కొంత ఉద్యోగి, కొంత ప్రభుత్వం చెల్లిస్తూ ఉంటారు. పాశ్చాత్య దేశాల్లో ఇదే పద్ధతి అమల్లో ఉంది.

ఇప్పటికే పాఠశాలల్లో 27 కోట్ల వరకు ఉన్న పిల్లలకు సరైన చదువు అందించలేకపోతున్నారు. వయసు పెరిగినవారికి తగిన స్థాయి పెన్షన్లు ఇవ్వటం కష్టమవుతోంది. ఇంకా పిల్లల్ని కనండని మీరు, స్టాలిన్ పాట పాడటం ఎంతవరకు సమంజసం?

ఓటు బ్యాంకు కాస్త పెరగొచ్చుగానీ, ఇందువల్ల ఉపయోగం శూన్యం. పైగా, ఏ ప్రభుత్వం ఎంతకాలం అధికారంలో ఉంటుందో తెలియదు. ఇష్టమొచ్చినట్లు సలహాలిస్తే నష్టపోయేది ప్రజలు. అయినా ఇప్పుడు పిల్లలు పుట్టి, పెరిగి పెద్దవాళ్ళయి మీకు ఓట్లు వేస్తారనుకుంటున్నారా? మీరు, నేను దేశాన్ని ఉద్ధరించటానికి అప్పటిదాకా ఉంటామా? ఆశించిన ప్రయోజనాలు నెరవేరతాయా? నిజాయితీగా మాట్లాడుకుందాం.. అధికారం కోసమే కదా ఇప్పుడు రాజకీయమంతా. ఆ తర్వాత వారసత్వం కోసం..

మీరు రాష్ట్రానికి పాలకులే తప్ప, కుటుంబాలకు పెత్తందారు కాదు.

దయచేసి మీ సూచన ఉపసంహరించుకోండి. ఎంతమంది పిల్లల్ని కనాలనే విషయం ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు వదిలేయండి.

ఏడాదికి లక్షల్లో విద్యార్థులు డిగ్రీలు చేతబట్టి బయటకు వస్తున్నారు. వీరిలో అత్యధికులకు నాణ్యమైన విద్యాప్రమాణాలు లేవు. ఈ పరిస్థితిని బాగుచేయండి.

ఇప్పటికే ఉపాధిలేని యువతలో పలువురు సెల్ ఫోన్లు, మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలై అనుత్పాదక, అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారు. వీరి జీవితాలను బాగుచేయరా? అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా, ఆర్థిక కేంద్రంగా తయారుచేయటం మనందరి బాధ్యత కనుక, సహకరించమని అడగండి. వారిని పౌరులుగా తయారుచేయండి.

ఇప్పటివరకు జరిగిందేదో జరిగింది. ఇకనుంచైనా ఆచితూచి సమగ్ర దృష్టితో వ్యవహరించండి. సమస్యల్ని సరైన సంస్కరణలతో ఎదుర్కోండితప్ప, వక్రభాష్యాలు, అడ్డదారులతో కాదు.మేం కొందరు మిత్రులం అనుకుంటాం. స్కూల్ నుంచే పిల్లలకు.. అవినీతిని అరికట్టటం, ప్రకృతిని కాపాడుకోవటం, మొక్కలను పెంచి కాలుష్యరహిత వాతావరణం సృష్టించటం అనే కనీస పరిజ్ఞానం తెలియచేయటం అవసరం అని. ప్లాస్టిక్ ఒక విషపూరిత, ప్రాణాంతక పదార్థం అని చాలామందికి తెలుసు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే ఆలోచన గతంలో కొన్ని స్కూల్స్ నుంచి ప్రారంభించారు.

స్వచ్ఛ భారత్ అని జాతీయ స్థాయి ప్రభుత్వం, జన్మభూమి అని మీరు.. మంచి కార్యక్రమాలను ప్రారంభించటం, ఎందరో వాటిల్లో పనిచేయటం నాకు తెలుసు. కానీ వీటిని కొద్దికాలానికే విస్మరించి, మొక్కుబడిగా చేస్తుండటం బాధాకరం. వీటి అమలుకు పదవులతో పని లేదు. ప్రభుత్వం మారితే పథకాలన్నీ మారనక్కర్లేదు. మంచివారిని కొనసాగించండి. మీ పట్ల ప్రజల్లో అపారమైన నమ్మకం ఉంది. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి, ఆదాయాలు పెరిగే ఉపాధి, చట్టబద్ధపాలన, ఓట్ల కొనుగోలు అవసరం లేకుండా

ఎన్నికల సంస్కరణలు వంటి మార్పుల ద్వారా ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేయండి. మేం ఉంటున్న హైదరాబాద్ ఎంత ముఖ్యమో, పుట్టిన ఆంధ్రప్రదేశ్ కూడా అంతే ముఖ్యం.

**ధన్యవాదాలతో,**

**ఏ. అన్నపూర్ణ**

# పోలవరం నిర్మాణంపై పార్లమెంటు స్థాయీ సంఘం నివేదిక

అంతర్రాష్ట్ర బహుళార్ధసాధక పోలవరం ప్రాజెక్టును +45.72 మీటర్ల ప్రకారం చూస్తే, 2024 నవంబర్ 30 నాటికి మొత్తం పనుల్లో 53.46% పూర్తయినట్లు పార్లమెంటరీ స్థాయీ సంఘం సభకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఇందులో నిర్మాణ పనులు 76.79%, భూసేకరణ, సహాయ పునరావాస పనులు 22.58% పూర్తయినట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న సవాళ్లు, ప్రస్తుత పురోగతిని దృష్టిలో ఉంచుకొని నిర్దిష్ట గడువులోగా మొత్తం ప్రాజెక్టు పూర్తి చేయటానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇందులో భాగస్వామ్యులందరినీ కలుపుకొని సమన్వయంతో ముందుకెళ్లాలని స్థాయీ సంఘం సూచించింది. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవటానికి సహాయ పునరావాసం, ఆపరేషన్-మెయింటెనెన్స్, భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవటం చాలా ముఖ్యమని పేర్కొంది. అంతరాష్ట్ర సమస్యలను పరిష్కరించుకొని డ్యాం భద్రత కోసం నిపుణుల కమిటీ చేసిన సూచనల అమలుకు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

జనవరి 8 నుంచి 11 మధ్య పార్లమెంటు స్థాయీ సంఘం క్షేత్రస్థాయిలో పర్యటించినపుడు పోలవరం ప్రాజెక్టు సమీపంలో శాశ్వత నివాస కాలనీలు ఏవీ కనిపించలేదని గుర్తుచేసింది. ఉన్నతాధికారులు ప్రాజెక్టుకు సమీపంలోనే ఉండి, వేగంగా నిర్మాణ పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించటానికి ప్రాజెక్టు స్థలంలో శాశ్వత కాలనీలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. +41.15 మీటర్ల వరకు ఇందులో నీటిని నిల్వచేసేలా ప్రాజెక్టు నిర్మాణాన్ని 2026 మార్చి వరకు పూర్తి చేయాలని తొలుత షెడ్యూల్ నిర్ణయించినా, ఇందులో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను దృష్టిలో ఉంచుకొని మరో ఏడాది గడువు పొడిగించిన విషయాన్ని కమిటీ తన నివేదికలో గుర్తుచేసింది. ఇప్పటివరకు మొత్తం 373 ముంపు ప్రాంతాలకుగాను 38 ప్రాంతాలనే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొంది. 213 ఆర్ అండ్ ఆర్ కాలనీలకు ... 26 కాలనీల నిర్మాణమే పూర్తయినట్లు తెలిపింది. 1,06,006 ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకుగాను 2,797 కుటుంబాలకే పునరావాసం కల్పించినట్లు గుర్తుచేసింది. ఇంత భారీ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో ముంపు అనివార్యమైనా, బాధితులకు గడువులోగా పునరావాసం కల్పించటానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. జలశక్తి శాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టుల కింద సహాయ, పునరావాస కార్యక్రమాలు చాలా నిదానంగా సాగుతున్నట్లు పేర్కొంది. దీనివల్ల ముంపు బాధితుల ప్రయోజనాలు ప్రమాదంలో పడుతున్నట్లు తెలిపింది. సకాలంలో సహాయ, పునరావాసం చేపట్టాల్సిన ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని జలశక్తి శాఖ ఈ పనులను వేగవంతం చేయాలని సిఫార్సు చేసింది.

+ 41.15 మీటర్ల వరకు అంచనాలను ఏపీ ప్రభుత్వం 2023 మార్చిలో సమర్పించింది.

ఈ ప్రాజెక్టు నుంచి తొందరగా ప్రయోజనాలు పొందటానికి +41.15 మీటర్ల స్థాయి (తొలిదశ) వరకు నీటి నిల్వ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 36,449.83 కోట్లతో సవరించిన ధరల అంచనాను 2023 మార్చిలో సమర్పించినట్లు స్థాయీసంఘం ఈ నివేదికలో పేర్కొంది. ఇందులో సివిల్ పనులు ఎఫ్ఆర్ఎల్, +45.72 మీటర్ల వరకు, సహాయ - పునరావాస పనులు +41.15 మీటర్ల వరకు చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపింది.

యూనియన్ మంత్రివర్గం +41.15 మీటర్ల వరకు నీరు నిల్వ చేసేందుకు రూ. 30,436.95 కోట్ల అంచనా విలువలను ఖరారు చేసి, అందులో కేంద్ర గ్రాంట్‌ను రూ. 12,157.53 కోట్లకు పరిమితం చేస్తూ 2024 ఆగస్టు 28న జరిగిన సమావేశంలో ఆమోదించినట్లు పేర్కొంది.

పోలవరంపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌తోపాటు ఆ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయటం ఏపీతోపాటు తెలంగాణ, ఇతర పొరుగు రాష్ట్రాలకు కూడా ఉపయోగకరమని తెలియచేస్తూ లోక్‌సత్తా నేతృత్వంలోని తెలుగు, తెలుగేతర స్వతంత్ర నిపుణుల కమిటీ సమగ్ర నివేదికను యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలకు, అన్ని రాజకీయ పార్టీలకు, ఎమ్మెల్యే, ఎంపీలకు అందించిన సంగతి తెలిసిందే.



పోలవరం ప్రాజెక్టుకు యూనియన్ ప్రభుత్వం సుమారు మరో రూ. 2,705 కోట్లు అడ్వాన్స్‌గా విడుదల చేసేందుకు పచ్చజెండా ఊపింది. ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి, అక్కడి నుంచి సింగిల్ నోడల్ ఖాతాకు చేరతాయి. తాజాగా ఇచ్చిన ఈ అడ్వాన్స్‌తో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యూనియన్ ప్రభుత్వం పోలవరానికి రూ. 5,512 కోట్లు ఇచ్చినట్లయింది. ఇందులో రూ. 5,048 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చినట్లే లెక్క. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక 2014 నుంచి ఇప్పటివరకు ఏ ఆర్థిక సంవత్సరంలోనూ ఇంత మొత్తంలో యూనియన్ నిధులు ఇవ్వలేదు. పైగా గతంలో మొదట రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తే తర్వాత యూనియన్ ప్రభుత్వం రీఇంబర్స్ చేసేది. అలాంటిది ఇప్పుడు ఒక్క ఆర్థిక సంవత్సరం లోనే రూ. 5వేల కోట్లకు పైగా అడ్వాన్స్‌గా ఇచ్చింది.

# ఉన్నత విద్య - నైపుణ్యాల అభివృద్ధి..
# 2050 నాటికి సమున్నత తెలంగాణ

నాణ్యమైన విద్య, యువత సాధికారత ద్వారా 2050 నాటికి సమున్నత తెలంగాణ లక్ష్యంగా 'ఉన్నత విద్య - నైపుణ్యాల అభివృద్ధి' పై సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య), తెలంగాణ అభివృద్ధి ఫోరం (టీడీఎఫ్) హైదరాబాద్ లో నిర్వహించిన సదస్సులో ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కీలక సూచనలు చేశారు. విద్యలో మరింత ఎంపిక స్వేచ్ఛ ఉండాలన్నారు. చాలామంది సమాజానికి అవసరమైన నైపుణ్యాలు లేకుండా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు అవుతున్నారని, ఈ పరిస్థితి మారాలన్నారు. మన సమాజంలో విద్య పట్ల ఉన్న సానుకూలతల వల్ల ఈ రంగంలో వేగంగా మార్పులు తేగలమని, సమ్మిళిత అభివృద్ధిని సాధించగలమని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విద్యాప్రమాణాలను పెంచే ప్రయత్నాలకు దృఢ సంకల్పంతో సహాయపడేందుకు అనేకమంది సిద్ధంగా ఉన్నారని జేపీ తెలిపారు. సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయిప్రసాద్, అనిల్ కుమార్, డాక్టర్ గోపాల్ రెడ్డి, కావేరి వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి, ఎమ్మెల్సీ కోదండరాం, మారుతి సుజుకి లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సీవీ రామన్, పలువురు పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.



# న్యాయంగా డీలిమిటేషన్



పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో పారదర్శకత కొరవడిందని, రాష్ట్రాల్లోని పార్టీలు, ప్రభుత్వాలు, ప్రముఖులతో కూలంకషంగా చర్చించాకే యూనియన్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల ఉమ్మడి కార్యాచరణ సమితి (జాక్) స్పష్టం చేసింది. చెన్నైలో జరిగిన ఈ సమావేశానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షత వహించారు. తెలంగాణ, కేరళ, పంజాబ్ సీఎం లు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తదితరులు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాలకు 33% సీట్లు ఇవ్వాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోరగా, ఆర్థిక వాటాకి అనుగుణంగా 36% సీట్లు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మొత్తంగా, సమస్యను ఆమోదయోగ్యంగా పరిష్కరించలేకుంటే, 1971 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత నియోజకవర్గాల సంఖ్యనే మరో పాతికేళ్ల పాటు కొనసాగించాలని సమావేశం కోరింది. తదుపరి జాక్ సమావేశం బహిరంగసభతో హైదరాబాద్ లో నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పందిస్తూ, జనాభా ప్రాతిపదికన సీట్లు ఉండకూడదనటం ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదని, ఆ బలహీనమైన వాదనకి బదులు.. మెజారిటీతో తమ మీద ఇతర భాషలను బలవంతంగా రుద్దకుండా, రాష్ట్రాల హక్కులను కాపాడేలా ఫెడరల్ వాదనతో రాజ్యాంగపరంగా పకడ్బందీ ఏర్పాట్లకు రాష్ట్రాలు పట్టుపట్టవచ్చన్నారు. రాజ్యసభ అధికారాలు పెంచటం వంటి వినూత్న పరిష్కారాలు అడగవచ్చన్నారు. 2001 లో FDR, లోక్‌సత్తా కృషి వల్ల దేశంలో అప్పుడున్న పరిస్థితుల్లో నియోజకవర్గాల పునర్విభజన ఫ్రీజ్ చేశారని (84 వ రాజ్యాంగ సవరణ), ఇప్పుడు లోక్ సభ కోరుకుంటే పునర్విభజన తప్పదని స్పష్టం చేశారు. జనాభాను తగ్గించుకుని అభివృద్ధి చెందుతున్నందుకు గర్వపడాలి తప్ప, నష్టపోతున్నట్లు దక్షిణాది రాష్ట్రాలు అబద్ధాలు ఆడక్కర్లేదన్నారు. కాస్త ఎక్కువ జనాభాతో ఎక్కువ సీట్లు పొందే అవకాశమున్న యూపీ, బీహార్ లలో కూడా జనాభా తగ్గుతోందని, ఇప్పుడున్నవాళ్లకే మంచి విద్య, ఉపాధి ఇవ్వటం చేతకానప్పుడు ఇంకా పిల్లల్ని కనమని చంద్రబాబు, స్టాలిన్ లాంటి వాళ్ళు మాట్లాడటం తగదని జేపీ హితవు పలికారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th April, 2025 Posting Date 15 &16th of every month



# పాఠశాల విద్యలో తేవలసిన మార్పులను తెలంగాణ ముఖ్యమంత్రికి వివరించిన జేపీ బృందం

1960 దశకం నుంచి ఇప్పటివరకూ విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన పలు అనాలోచిత విధానాలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మకశక్తిని, ఆలోచనా ధోరణిని ఎలా హరించి వేశాయో ప్రజాస్వామ్య పీఠం(FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. తెలంగాణలో ఒక్కో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిపై ప్రతి సంవత్సరం రూ. 1,08,000 దాకా ఖర్చు పెడుతున్నా చదువు దారుణంగా ఉందని విద్యాశాఖకు కూడా ఇంఛార్జిగా ఉన్న రేవంత్ ఇటీవల చట్టసభలో ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యా వ్యవస్థను బాగు చేయటానికి తగిన సూచనలు ఇవ్వవలసిందిగా సమాజాన్ని పార్టీలకతీతంగా కోరిన సందర్భంగా స్పందించిన జేపీ.. స్థూల నివేదికను తయారుచేసి FDR బృందంతో ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లోని ఐసీసీసీ లో కలిసి అందించారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలు, ఒత్తిడిలేని పరీక్షల విధానం ద్వారా బేరీజు, పాఠశాలల్లో పర్యవేక్షణ, టెస్టింగ్, జీవన నైపుణ్యాల పెంపు తదితర అంశాల పరిధిలో పలు మార్పులను ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో..సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి విద్యాకమిషన్‌ని ఆదేశించారు. ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, శ్రీనివాసరాజు, విద్యా కమిషన్ సభ్యులు ప్రొ. పీఎల్ విశ్వేశరరావు, వెంకటేష్, శివ జ్యోత్స్న, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, డైరెక్టర్ నరసింహారెడ్డి, పలు ఎన్‌జీఓల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.